జీవితం ఆరంభం నుండి అంతం వరకు
అనుక్షణం మన జీవితంలో భాగమై
కష్టాల్లో సుఖాల్లో
అడుగడుగునా తోడుండే
స్త్రీమూర్తులందరికి
మహిళా దినోత్సవ
శుభాకాంక్షలు

HAPPY, Women's DAY

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్ 08.03.2025 | 24 క్యారెట్లు 87,447.00 | కిలో వెండి 1,07,658.00 | 32 °C | సంపుటి:3 | సంచిక:137

www.vishalabharati.com

# కేంద్రంపై స్టాలిన్ యుద్ధం

## డీలిమిటేషన్‌పై 7 రాష్ట్రాల సీఎంలతో జేఏసీ
## మార్చి 22న చెన్నైలో అఖిలపక్ష సమావేశం
## తమతో కలిసి రావాలని సీఎంలకు లేఖ
## సీనియర్ నేతలు, ప్రతిపక్ష పార్టీలకూ ఆహ్వానం
## రాజ్యాంగ సవరణలకు కేంద్రంపై డిమాండ్

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

డీలిమిటేషన్ అంశంలో కేంద్ర ప్రభుత్వంతో చేస్తున్న యుద్ధాన్ని తమిళనాడు సీఎం, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్.. మరింత ఉధృతం చేశారు. ఈ విషయంలో తమతో కలిసి రావాలని దక్షిణాది రాష్ట్రాలకు విజ్ఞప్తి చేస్తున్నారు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పెంపు జరిగితే.. గతంలో జనాభా నియంత్రణను పక్కాగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని.. లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం



..మిగతా 2 లో

# దక్షిణాదిపై డీలిమిటేషన్ కుట్ర

## ఎన్నికల్లో సీట్లు తక్కువొచ్చాయని మోదీ కక్ష



- బీజేపీకి వచ్చింది 29 సీట్లే
- ఎంపీ సీట్లు తగ్గించేందుకే పునర్విభజన ఆయుధం
- 1971 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేపట్టాలి
- హిందీ జాతీయ భాష కాదు.. బలవంతంగా రుద్దొద్దు
- దేశంలో రెండోస్థానంలో ఉన్న తెలుగుకు ప్రాధాన్యమేదీ?
- ఒలింపిక్స్‌కు అహ్మదాబాద్ కంటే హైదరాబాద్ బెటర్
- ప్రధాని మోదీని గౌరవిస్తా.. రాజకీయంగా విభేదిస్తా
- ఇండియా టుడే కాంక్లేవ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

*తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై స్పందించారు. దక్షిణ భారతదేశంలో బీజేపీ ప్రాతినిధ్యం అంతంతమాత్రమేనని, ఇటీవలి ఎన్నికల్లో బీజేపీకి దక్షిణాదిన వచ్చింది 29 ఎంపీ స్థానాలేనని అన్నారు. దక్షిణాదిన ఒక్క రాష్ట్రంలోనూ బీజేపీకి అధికారం లేదని, ఏపీలో కేవలం జూనియర్ భాగస్వామిగానే ఉందని తెలిపారు. అందుకే బీజేపీ ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తోందని... అందుకు డీలిమిటేషన్ అంశాన్ని వాడుకుంటోందని వివరించారు. డీలిమిటేషన్ అమలు జరిగితే ఉత్తరాది రాష్ట్రాలకే లబ్ధి చేకూరుతుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.*

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

గతంలో కేంద్రం ఆదేశాలతోనే దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేశాయని అన్నారు. కేంద్రం మరో 30 ఏళ్ల పాటు డీలిమిటేషన్‌ను వాయిదా వేయాలని, అప్పుడు దక్షిణ భారతదేశంలో జనాభా ఏ రీతిలో పెరుగుతుందో చూడాలన్నారు. కేంద్రం ఆదేశాల మేరకు కుటుంబ నియంత్రణను తాము సమగ్రంగా అమలు చేసినందుకు మూల్యం చెల్లించాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. పునర్విభజనతో దక్షిణాది మాత్రమే కాకుండా పంజాబ్ వంటి రాష్ట్రాలు కూడా నష్టపోతాయని, రాజస్థాన్, బీహార్, యూపీ వంటి బీమారు రాష్ట్రాలు ఎక్కువ ప్రయోజనాలు పొందుతాయని తెలిపారు. ఢిల్లీలో శుక్రవారం జరిగిన ఇండియా టుడే కాంక్లేవ్‌లో ఆయన మాట్లాడారు.

**1971 లెక్కల ప్రకారమే పునర్విభజన చేయాలి..**

జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేస్తే దక్షిణాదికి తీవ్ర అన్యాయం జరుగుతుందని, ప్రో రేటా ప్రకారం చేసినా ఇదే పరిస్థితి నెలకొంటుందని వివరించారు. "ఉదాహరణకు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో ప్రస్తుతం 80 సీట్లు ఉన్నాయి. ప్రో రేటా ప్రకారం 50 శాతం సీట్లు పెంచాలని అనుకుంటే అక్కడ 120కి పెరుగుతాయి. అదే సమయంలో, తమిళనాడులో ప్రస్తుతం 39 సీట్లున్నాయి. అక్కడ 50 శాతం చొప్పున పెంచితే 60 సీట్లు అవుతాయి. ప్రస్తుతం ఆ రెండు రాష్ట్రాల్లోని అసెంబ్లీ సీట్ల

..మిగతా 2 లో

# డీలిమిటేషన్‌పై తప్పుడు ప్రచారం

## ఏ ఒక్క రాష్ట్రంలోనూ ఎంపీ సీట్లు తగ్గవు

- 2009లో యూపీఏ చేసిన మాదిరిగానే పునర్విభజన
- త్వరలో జనగణన ప్రారంభం
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫైర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

చట్టసభల్లో మహిళా రిజర్వేషన్‌లను వ్యతిరేకిస్తున్న పార్టీలే నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్)పై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి చెప్పారు. దేశవ్యాప్తంగా ఏ ఒక్క రాష్ట్రంలో కూడా ఎంపీ, ఎమ్మెల్యేల నియోజకవర్గాలు తగ్గబోవని స్పష్టం చేశారు. 2009లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం నిర్వహించిన విధంగానే ఈసారి నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందని చెప్పారు. త్వరలో జనగణన ప్రారంభమవుతుందని ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన



ఉంటుందని వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మహిళా మోర్చా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో


..మిగతా 2 లో

# 10న గ్రూప్–1 ఫలితాలు

- 11న గ్రూప్-2, 14న గ్రూప్-3 జనరల్ ర్యాంకుల జాబితా
- 17న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల తుది జాబితా విడుదల
- ఫలితాల షెడ్యూల్‌ను ప్రకటించిన టీజీపీఎస్సీ
- ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా సంప్రదిస్తే.. ఫిర్యాదు చేయాలన్న టీజీపీఎస్సీ చైర్మన్

..మిగతా 3 లో






# 21 మంది ఐపీఎస్‌ల బదిలీ..

- ఇంటెలిజెన్స్ ఎస్పీగా సింధూ శర్మ
- వరంగల్, కరీంనగర్ కు కొత్త సీపీలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు జరిగాయి. మొత్తం 21 మందికి ప్రభుత్వం స్థానకల్పించింది. ఈ మేరకు శుక్రవారం సీఎస్ శాంతి కుమారి

..మిగతా 2 లో

# అసెంబ్లీకి వస్తున్నా..

## రేవంత్‌కు ఇక దబిడి దిబిడే



- కాంగ్రెస్‌పై రాష్ట్ర ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్‌దే విజయం
- ప్రభుత్వానికి చాలా సమయం ఇచ్చాం
- ఆరు గ్యారెంటీలు అమలులో విఫలం
- ఏప్రిల్ 27న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ
- 10 లక్షల మంది హాజరయ్యేలా ఏర్పాట్లు
- ఏడాది పొడవునా బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు
- బీఆర్ఎస్ నేతలతో అధినేత కేసీఆర్
- రెండు ఎమ్మెల్సీ స్థానాలకు పోటీపై చర్చ
- తెరపైకి సత్యవతి రాథోడ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దాసోజు శ్రవణ్ పేర్లు

*కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకతను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో తాను సభకు హాజరై ప్రభుత్వ తీరును ఎండగడతానని బీఆర్ఎస్ నేతలకు స్పష్టం చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో పార్టీ నేతలతో కేసీఆర్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు.*

..మిగతా 2 లో

# మహిళకు శక్తి!

- నేడు ఇందిరా మహిళా శక్తి మిషన్ – 2025 ఆవిష్కరణ
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేలా కొత్త పాలసీ
- ఆర్థిక వెసులుబాటు, ఆర్థిక ఎదుగుదలే లక్ష్యమన్న మంత్రి సీతక్క
- నేడు పరేడ్ గ్రౌండ్స్‌లో లక్షమంది మహిళలతో సభ
- పలు పథకాలు, కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్న సర్కారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం లక్ష మంది మహిళల తో సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో శనివారం భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళాశక్తి మిషన్2025ను సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా ఆవిష్కరించనున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క

..మిగతా 2 లో



# బిల్లులు చెల్లించాలంటే 20 శాతం కమిషన్

## సచివాలయంలో కాంట్రాక్టర్ల మెరుపు ధర్నా


- జిల్లాల నుంచి తరలివచ్చిన 200 మంది కాంట్రాక్టర్లు
- సైలెంట్‌గా వెళ్లిపోయిన డిప్యూటీ సీఎం భట్టి
- కాంట్రాక్టర్ల ధర్నా.. ప్రభుత్వ ప్రతిష్ఠకు మాయని మచ్చ
- మంత్రులకు కమీషన్ల ఆరోపణలపై రాహుల్ స్పందించాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఫైర్

..మిగతా 2 లో



# కార్మికులను కనిపెట్టిన క్యాడవర్ డాగ్స్

- మూడు స్పాట్లు గుర్తింపు.. ఆయా ప్రాంతాల్లో తవ్వకాలు
- 14 రోజులుగా సాగుతున్న రెస్క్యూ
- టీబీఎం మిషన్‌ను కట్ చేస్తున్న రైల్వే నిపుణులు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకుపోయిన కార్మికులను బయటకు తీసుకొచ్చేందుకు 14 రోజులుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్న తెలిపిందే. అయితే ఇప్పటికీ 8 మంది కార్మికుల జాడ తెలియలేదు. శుక్రవారం నాడు కేరళ పోలీసు శాఖకు చెందిన కడావర్ డాగ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దించిన సంగతి తెలిసిందే. ఉదయం 7 గంటలకు రెండు క్యాడవర్

..మిగతా 3 లో

## డీలిమిటేషన్‌పై తప్పుడు ప్రచారం

**తరువాయి భాగం:** ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహిళా ఉపాధ్యాయులు, పట్టభద్రులు 90శాతం మంది బీజేపీకే ఓటువేసినట్లు సర్వేలో తేలిందని కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ అన్నారు. మహిళాశక్తిని గుర్తించడం వల్లే దేశ ప్రథమ పౌరురాలుగా ద్రౌపది ముర్మును, ఆర్థిక మంత్రిగా నిర్మలకు ప్రధాని మోదీ బాధ్యతలు అప్పగించారని గుర్తు చేశారు. కాగా, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ శనివారం హైదరాబాద్ రానున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు, స్థానిక ఎన్నికలపై రాష్ట్ర ముఖ్యులతో సమావేశాలు నిర్వహించనున్నారు.



## బిల్లులు చెల్లించాలంటే 20 శాతం కమిషన్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం కాంట్రాక్టర్లు మెరుపు ధర్నా చేపట్టారు. బిల్లులు రావడం లేదంటూ ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చాంబర్ ముందు ఆందోళనకు దిగారు. వివిధ జిల్లాల నుంచి 200 మందికి పైగా కాంట్రాక్టర్లు.. ఆర్థిక శాఖ మంత్రి భట్టి కలిసేందుకు వచ్చారు. అయితే ఎస్పీఎఫ్ సెక్యూరిటీ సిబ్బంది ఆపడంతో కాంట్రాక్టర్లు ఆందోళనకు దిగారు. దీంతో కాంట్రాక్టర్లు నిరసన విరమించేలా పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. గత మూడు సంవత్సరాలకు పైగా పెండింగ్‌లోనే బిల్లులు ఉన్నట్లు కొంత మంది కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఈ పెండింగ్ బిల్లులు క్లియర్ కావాలంటే కనీసం 20 శాతం కమీషన్ అధికారులు అడుగుతున్నట్లు తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే, కాంట్రాక్టర్ల ఆందోళనతో సెక్రటేరియట్ నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైలెంట్‌గా వెళ్లిపోయినట్లు టాక్ నడుస్తోంది. కాంట్రాక్టర్ల ఆందోళనపై ప్రభుత్వ వర్గాలు ఇంతవరకు స్పందించలేదు. ప్రతిపక్ష పార్టీల నేతలు మాత్రం 20 శాతం కమిషన్లు డిమాండ్ చేయడమే ఈ పరిస్థితికి కారణమంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు

**బిల్లుల మంజూరుకు 20శాతం కమీషన్లా: హరీష్‌రావు**

"మాది ప్రజా ప్రభుత్వమని ప్రచారం చేసుకునే భట్టి విక్రమార్క బకాయిలు చెల్లించాలని కాంట్రాక్టర్లు సచివాలయానికి వేస్త ఎందుకు మొహం చాటేశారు? పోలీసులను అడ్డుపెట్టుకొని వెనుక గేటునుంచి ఎందుకు వెళ్లిపోయారు? ప్రజా ప్రభుత్వమంటే పలాయనం చిత్తగించడమేనా?" అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఢిల్లీ బాస్‌లకు కప్పం కట్టేందుకు అన్ని వర్గాల నుంచి మంత్రులు లంచాలు తీసుకుంటున్నారని లోకం కోడై కూస్తోందని పేర్కొన్నారు. సచివాలయంలోని ఆర్థిక మంత్రి చాంబర్ ఎదుట కాంట్రాక్టర్లు ధర్నా చేయడం.. ఆ ఆరోపణలకు బలం చేకూరుస్తోందని ఓ ప్రకటనలో తెలిపారు. బిల్లుల మంజూరుకు 20శాతం కమీషన్ తీసుకుంటున్నారంటూ కాంట్రాక్టర్లే స్వయంగా చెప్పడం.. ప్రభుత్వ ప్రతిష్ఠకు మాయని మచ్చగా నిలుస్తోందని పేర్కొన్నారు. నీతి సూత్రాలు చెప్పే రాహుల్ గాంధీ.. ఈ అంశంపై స్పందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు సుమోటోగా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కమీషన్లకు ఆశపడి కొందరు మంత్రులు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్న వైనం, కాంగ్రెస్ ప్రభుత్వ కమీషన్ల కక్కుర్తి సచివాలయం సాక్షిగా బట్టబయలైందన్నారు. పెండింగ్ బిల్లులపై సర్పంచ్‌లు రోడ్డెక్కినా ప్రభుత్వం కరుణించడం లేదని, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకే రూ.6వేల కోట్లు బాకీ పడిందని గుర్తు చేశారు. కాంట్రాక్టర్ల తరహాలో ఉద్యోగులు కూడా కమీషన్లు ఇవ్వాల్సిందేనా? అని నిలదీశారు.

## దక్షిణాదిపై డీలిమిటేషన్ కుట్ర



**తరువాయి భాగం**

మధ్య తేడా 40 మాత్రమే. కానీ, ప్రో రేటా ప్రకారం సీట్లను పెంచితే ఈ తేడా ఏకంగా 60కి చేరుతుంది. ఒక్క రాష్ట్రంలోనే ఇంత తేడా ఉంటే.. మిగతా రాష్ట్రాల పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించారు. దక్షిణాదిలో ప్రస్తుతం 126 లోక్‌సభ సీట్లు ఉన్నాయని, ఇక్కడ 50 శాతం పెంచితే గరిష్ఠంగా 62 పెరుగుతాయని.. మొత్తంమీద 185 సీట్లకు దాటదని వివరించారు. దక్షిణాదిలో బీజేపీకి తగిన ప్రాతినిధ్యం లేదని, మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినా ఆ పార్టీకి వచ్చిన 240 సీట్లలో ఇక్కడ గెలిచింది కేవలం 29 సీట్లు మాత్రమేనని గుర్తు చేశారు. అందుకే ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తోందని ఆరోపించారు. అందరికీ మంచి జరగాలని ఉంటే అఖిలపక్ష సమావేశాన్ని ఎందుకు నిర్వహించడం లేదని నిలదీశారు. ప్రభుత్వపరమైన నిర్ణయాన్ని అధికారులపై ఎందుకు వదిలేస్తున్నారని ప్రశ్నించారు. పునర్విభజనపై అన్ని రాజకీయ పార్టీలను పిలిచి చర్చించాలని డిమాండ్ చేశారు. కుటుంబ నియంత్రణ విధానానికి ముందు 1971 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని అన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఎక్కువ మంది పిల్లల్ని కనాలని చెబుతున్నారుగా అని ప్రశ్నించగా.. "30ఏళ్ల తర్వాత పునర్విభజన చేపట్టమనండి. అప్పుడు దక్షిణాది సత్తా ఆధారంగా సంఖ్య పెరుగుతుంది. అప్పుడు మా నియోజకవర్గాలూ పెరుగుతాయి" అంటూ నవ్వులు పూయించారు. హిందీ ఈ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే భాష మాత్రమేనని, అది జాతీయ భాష కానేకాదని రేవంత్ చెప్పారు. హిందీని బలవంతంగా రుద్దాల్సిన అవసరం లేదని, ఎవరైనా ఏ భాషనైనా నేర్చుకునే అవకాశం కల్పించాలని సూచించారు. "హిందీ తర్వాత అత్యధికంగా తెలుగు, బెంగాలీ భాషలు మాట్లాడే వారున్నారు. మరి, తెలుగుకు ఎంతమేర ప్రాధాన్యం ఇస్తున్నారు? సివిల్స్ పరీక్షల్లో తెలుగు ఎందుకు లేదు!?" అని ప్రశ్నించారు.

**గుజరాత్ నమూనా ఔట్ డేటెడ్..**

"గుజరాత్ నమూనాకు కాలం చెల్లింది. ఇప్పుడిక తెలంగాణ నమూనానే దేశానికి ఆదర్శం. తెలంగాణ నమూనా ముందు గుజరాత్ నమూనా ఎందుకూ పనికి రాదు. గుజరాత్‌కు మోదీ బ్రాండ్ అంబాసిడర్ అయితే, తెలంగాణకు నేనే బ్రాండ్ అంబాసిడర్" అని అన్నారు. గిఫ్ట్ సిటీ పేరుతో కేవలం గుజరాత్‌నే అభివృద్ధి చేయాలని మోదీ అనుకుంటున్నారని, అక్కడ కల్పించిన రాయితీలను ఇతర రాష్ట్రాల్లో ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో విదేశీ పెట్టుబడులకు ఎందుకు అవకాశం ఇవ్వడం లేదన్నారు. అన్ని పెట్టుబడులు గుజరాత్‌కే తరలిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో ఉన్న మౌలిక సదుపాయాలు అహ్మదాబాద్‌లో ఎక్కడున్నాయని నిలదీశారు. హైదరాబాద్‌లో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని ప్రారంభించామని, అది ఐదేళ్లలో ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా రూపుదిద్దుకుంటుందని చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధికి ఫలానా వ్యక్తి కారణమంటే తాను అంగీకరించబోనని, బ్రిటిష్ వారు, కులీ కుతుబ్ షా, నిజాం నుంచి మర్రి చెన్నారెడ్డి, చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి ఇలా ప్రతి ఒక్కరూ హైదరాబాద్ అభివృద్ధికి కారణమయ్యారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు, ఓబీసీలకు కాంగ్రెస్ పార్టీయే రిజర్వేషన్లు కల్పించిందని, ఇప్పుడు ఓబీసీలకు వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలని తాము భావిస్తున్నామని తెలిపారు. వాళ్ల డిమాండ్ సరైనప్పుడు ఇవ్వడంలో తప్పేం ఉందని ప్రశ్నించారు. ప్రతి మత విశ్వాసాన్ని తాము గౌరవిస్తున్నామని, తిరుపతి వెళ్లే వారికి రాయితీలు ఇస్తున్నామని ఓ ప్రశ్నకు జవాబిచ్చారు. "దేశ ప్రధానిగా మోదీకి ఇవ్వాల్సిన గౌరవం ఇస్తా. తెలంగాణకు సీఎంగా రాష్ట్రానికి కావాల్సినవి డిమాండ్ చేస్తా. అది నా హక్కు.. బాధ్యత. కాంగ్రెస్ ప్రతినిధిగా బీజేపీతో రాజకీయంగా విభేదిస్తా" అని అన్నారు. మోదీకి, తనకు మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని, మోదీని వ్యక్తిగా కాకుండా విధానపరంగానే తాను వ్యతిరేకిస్తున్నానని వివరించారు.

**ఒలింపిక్స్‌కు హైదరాబాద్ బెస్ట్**

హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించాల్సిందిగా క్రీడా మంత్రి మాండవీయకు తాను వినతిపత్రం సమర్పించానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఒలింపిక్స్ నిర్వహణకు హైదరాబాద్ అత్యుత్తమ నగరమని చెప్పారు. ఎన్నో అంతర్జాతీయ క్రీడలను హైదరాబాద్‌లో నిర్వహించామని, ఇక్కడ ఉన్నన్ని మౌలిక సదుపాయాలు ఎక్కడా లేవని చెప్పారు. ఒలింపిక్స్‌లో పాల్గొన్న సానియా మీర్జా, పీవీ సింధు, నిఖత్ జరీన్ హైదరాబాద్‌కు చెందిన వారేనని గుర్తు చేశారు. అలాంటి హైదరాబాద్‌ను కాదని మోదీ అహ్మదాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించాలని చూస్తున్నారని ఆరోపించారు.

**ఉచితాలపై దేశవ్యాప్త చర్చ జరగాలి..**

కేసీఆర్ అధికారంలోకి వచ్చినప్పుడు కేవలం రూ69 వేల కోట్లు మాత్రమే అప్పు ఉండేదని, పదేళ్లలో రూ.6 లక్షల కోట్లకుపైగా అప్పులు చేసి ప్రజలపై భారం మోపారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. అయినా, ప్రజలకు ఇచ్చిన హామీలను తాము నెరవేరుస్తున్నామని చెప్పారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ.21 వేల కోట్లు రైతులకు అందించామన్నారు. రుణ భారం ఉన్నప్పటికీ ప్రజలకు ఉచితాలు పంచడంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని, అది తన ఒక్కడి సమస్య కాదని చెప్పారు. మోదీ కూడా ఢిల్లీలో అనేక గ్యారెంటీలు ప్రకటించారని గుర్తు చేశారు. ఈ ఉచితాల కారణంగా నిజానికి మౌలిక సదుపాయాలపై రూ.500 కోట్లు కూడా ఖర్చు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

**కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం ఎక్కువ..**

కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం ఎక్కువ కావడం బలహీనతేనని రేవంత్ అంగీకరించారు. ఐదు సార్లు రాజ్యసభ సీటు వచ్చినా.. ఆరోసారి రాలేదని బహిరంగంగా విమర్శిస్తారని, జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తారని ఎద్దేవా చేశారు. బీజేపీలో అద్వాణీ, మురళీ మనోహర్ జోషి వంటి నేతలను పక్కన పెట్టినా అడిగేవాళ్లు లేరన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం చెబితే.. అదానీ నిధులను తాను వెనక్కి ఇవ్వలేదని, ప్రతిపక్షాలు నిందలు వేసినందుకే ఆ పని చేశానని చెప్పారు. కుంభమేళాను తాను వ్యతిరేకించలేదని, తన కుటుంబ సభ్యులు కుంభమేళాకు వెళ్లారని చెప్పారు. అయితే, భద్రాద్రిలో పురాతనమైన రామ మందిరం ఉందని, దానికి మోదీ ఎందుకు రాలేదని ప్రశ్నించారు.

## కేంద్రంపై స్టాలిన్ యుద్ధం

**తరువాయి భాగం**

తగ్గిపోతోందని గత కొన్ని రోజులుగా ఎంకే స్టాలిన్ చెబుతున్న విషయం తెలిసిందే. ఈ విషయంలో స్టాలిన్‌కు కేంద్ర ప్రభుత్వానికి తీవ్ర మాటల యుద్ధం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా 7 రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఎంకే స్టాలిన్ లేఖ రాశారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంలో ఆ రాష్ట్రాలను కలుపుకుని పోరాటం చేయాలని నిర్ణయించారు.

ఇటీవల తమిళనాడులో ఎంకే స్టాలిన్ నేతృత్వంలో ఒక అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దాదాపు 67 పార్టీల నేతలు హాజరై.. ఒక తీర్మానం చేసినట్లు తెలుస్తోంది. ఆ అఖిలపక్ష తీర్మానం ఆధారంగానే కేరళ, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులకు ఆ అఖిలపక్ష తీర్మానాన్ని పంపించినట్లు తెలుస్తోంది. డీలిమిటేషన్ అంశంపై సమష్టి కార్యాచరణ కోసం మార్చి 22వ తేదీన చెన్నైలో నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని ఆ 7 రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఎంకే స్టాలిన్ కోరారు. అలాగే ఆ 7 రాష్ట్రాలకు చెందిన సీనియర్ నేతలు, అధికార, ప్రతిపక్ష నాయకులను కూడా ఆహ్వానించారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన డీలిమిటేషన్ కసరత్తుకు వ్యతిరేకంగా జాయింట్ యాక్షన్ కమిటీజేఏసీ ఏర్పాటు చేద్దామని వారికి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది సమాఖ్యవాదంపై కేంద్రం చేస్తున్న దాడి అని.. దీనివల్ల పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల హక్కులకు కోత విధించి.. జనాభాను నియంత్రించిన రాష్ట్రాలకు శిక్ష విధించడమే అవుతుందని ఎంకే స్టాలిన్ ట్వీట్ చేశారు. ఈ అన్యాయాన్ని తాము సహించబోమని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇక లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను కేంద్ర ప్రభుత్వం 2026లో నిర్వహించేందుకు కసరత్తులు చేస్తోంది. అయితే కేంద్రం తీసుకునే నిర్ణయాల వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం కలుగుతుందనే ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం సూచించిన జనాభా నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు కఠినంగా అమలు చేశాయని.. ఉత్తరాది రాష్ట్రాల్లో మాత్రం భారీగా జనాభా పెరిగిపోవడంతో ఇప్పుడు జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేస్తే.. దక్షిణాది కంటే ఉత్తరాదిన భారీగా ఎంపీ సీట్లు పెరిగి.. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే 1971 జనాభా లెక్కల ప్రకారం.. పార్లమెంటు ఉభయసభల్లో రాష్ట్రాలకు ప్రస్తుతం ఉన్న నిష్పత్తి మేరకు నియోజకవర్గాల సంఖ్యను పెంచడానికి అవసరమైన రాజ్యాంగ సవరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డీఎంకే డిమాండ్ చేసింది.

## అసెంబ్లీకి వస్తున్నా..



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కేటీఆర్, హరీశ్ సహా పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ పలు అంశాలపై మాట్లాడారు. 'కాంగ్రెస్ పార్టీకి చాలా సమయం ఇచ్చాం. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని ఓపికగా ఎదురుచూశాం. కానీ, కాంగ్రెస్ సర్కారు ఏమీ చేయకపోగా.. రైతులు, ప్రజలకు ఇబ్బంది కలిగించే అసత్య ప్రచారాలతో కాలం వెళ్లదీస్తోంది' అని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీయే తెలంగాణ సమాజానికి రక్షణ కవచమని 15 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ద్వారా మరోసారి రుజువైందని చెప్పారు.

**10 లక్షల మందితో భారీ బహిరంగ సభ**

వచ్చే నెలలో జరగబోయే పార్టీ ఆవిర్భావ దినోత్సవం, 25 ఏళ్ల వేడుకలు, వరంగల్‌లో భారీ బహిరంగ సభ, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక, రాష్ట్రంతో పాటు దేశంలో వర్తమాన రాజకీయ పరిస్థితులపై నాయకులతో చర్చించారు. కాంగ్రెస్ ఆశ పెట్టిన గ్యారెంటీలను నమ్మి గెలిపించిన ప్రజలు.. ఇప్పుడు ఆ పార్టీ నిజస్వరూపం తెలుసుకున్నారని కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుందో చూద్దామని, ఆ తర్వాత బీసీల పక్షాన పోరాడదామని పార్టీ నేతలతో అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో తెలంగాణ సమాజం గర్వపడేలా రజతోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వరంగల్‌లో ఏప్రిల్ 27న 10 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని, అందుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని సూచించారు. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భారీ బహిరంగ సభను నిర్వహించాలని పేర్కొన్నారు. బహిరంగ సభ సన్నాహక సమావేశాలను నియోజకవర్గాల వారీగా నిర్వహించాలని చెప్పారు. అందుకోసం త్వరలో కమిటీలను వేయనున్నట్లు తెలిపారు.

**గ్రామ స్థాయి నుంచి కమిటీలు..**

బహిరంగ సభ సన్నాహక సమావేశాలను నియోజకవర్గాల వారీగా నిర్వహించాలని.. త్వరలో కమిటీలను వేస్తామని కేసీఆర్ అన్నారు. వరంగల్ బహిరంగ సభ అనంతరం.. పార్టీని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంస్థాగతంగా పటిష్ఠ పరిచి, ఆ దిశగా కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామని, ఆ తర్వాత నూతన కమిటీల బాధ్యులతో ప్రతినిధుల సభను నిర్వహిస్తామన్నారు. పార్టీ నేతలకు శిక్షణా తరగతులు కూడా చేపడతామని.. పార్టీలో యువత, మహిళా భాగస్వామ్యం పెంచాలన్నారు. కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వమున్నా తెలంగాణ సమాజానికి వ్యతిరేకంగానే పని చేస్తోందని.. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీని పటిష్ఠం చేసుకొని.. దేశ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాల పట్ల నిత్యం అప్రమత్తతో ఉండాలన్నారు. తెలంగాణ ఇంటి పార్టీ ప్రాతినిధ్యం పార్లమెంటులో లేకపోవడం వల్ల రాష్ట్ర హక్కులకు భంగం వాటిల్లుతోందని.. ఇదే విషయాన్ని ప్రజలకు మరింతగా అర్థమయ్యేలా చెప్పాలన్నారు. పార్లమెంటులో బీఆర్ఎస్‌ఎంపీల ప్రాతినిధ్యం ఉంటే లభించే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర హక్కులను కాపాడుకునే దిశగా ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాలని.. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఖరులను తిప్పికొట్టాలన్నారు.

**రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ**

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రెండు స్థానాల్లో పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కేసీఆర్ చర్చించినట్లు సమాచారం. ఎవరిని బరిలో దించాలన్న దానిపై జరిగిన చర్చలో ప్రధానంగా సత్యవతి రాథోడ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, దాసోజు శ్రవణ్ పేర్లు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. అయితే ఇందులో ఇద్దరిని పోటీలో నిలబెట్టే అవకాశం ఉంది. ఆ ఇద్దరు ఎవరనేది కేసీఆర్ త్వరలో ప్రకటిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

## 21 మంది ఐపీఎస్‌ల బదిలీ..

**తరువాయి భాగం**

ఉత్తర్వులు జారీ చేశారు. ట్రాన్స్‌ఫర్ అయిన అధికారుల్లో ఒక అడిషనల్ డీజీ, ఇద్దరు ఐజీపీలు, ఇద్దరు డీఐజీలు ఉన్నారు. అలాగే.. ఇద్దరు నాన్ క్యాడర్ ఎస్పీలకు సైతం బదిలీ అయ్యారు. మిగిలిన 14 మంది ఎస్పీలు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రభుత్వం ఒకేసారి 21 మంది ఐపీఎస్‌లను ట్రాన్స్ ఫర్ చేయడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**అధికారుల బదిలీలు.. పోస్టింగ్స్**

ఇంటెలిజెన్స్ ఎస్పీగా సింధూ శర్మ
నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా రూపేష్
సీఐడీ ఐజీగా ఎం. శ్రీనివాసులు
నిజామాబాద్ సీపీగా సాయి చైతన్య
రామగుండం సీపీగా అంబర్ కిషోర్ ఝా
వరంగల్ సీపీగా సన్‌ప్రీత్ సింగ్
సీఐడీ ఎస్పీగా సి. రవీందర్
కామారెడ్డి ఎస్పీగా రాజేష్ చంద్ర
ఆదిలాబాద్ ఎస్పీగా అఖిల్ మహాజన్
కరీంనగర్ సీపీగా గౌస్ ఆలం
భువనగిరి డీసీపీగా అక్షాన్స్ యాదవ్
సెంట్రల్ జోన్ డీసీపీగా శిల్పవల్లి
సిరిసిల్ల ఎస్పీగా గీతే మహేశ్ బాబా సాహెబ్
సంగారెడ్డి ఎస్పీగా పంకజ్ పరితోష్
వరంగల్ డీసీపీగా అంకిత్ కుమార్
పెద్దపల్లి డీసీపీగా కరుణాకర్
సూర్యాపేట ఎస్పీగా నరసింహ
మంచిర్యాల డీసీపీగా భాస్కర్
ఎస్ఐబీ ఎస్పీగా వై.సాయిశేఖర్
అడిషనల్ డీజీపీ (పర్సనల్)గా అనిల్‌కుమార్
ఉమెన్ సేఫ్టీ వింగ్ ఎస్పీగా చేతన

## కార్మికులను కనిపెట్టిన క్యాడవర్ డాగ్స్

**తరువాయి భాగం**

డాగ్స్‌తో కలసి సొరంగంలోని ప్రమాదస్థలం వద్ద కార్మికుల జాడ కోసం సహాయ బృందం గాలింపు చర్యలు చేపట్టింది. తిరిగి మధ్యాహ్నం రెండున్నరకు బయటకు తీసుకొచ్చారు. తప్పిపోయిన వారి ఆనవాళ్లకు సంబంధించి మూడు మృతదేహాల స్పాట్స్‌ను క్యాడవర్ డాగ్స్ గుర్తించాయి. జీపీఆర్ ద్వారా మార్క్ చేసిన ప్రదేశంలోనే క్యాడవర్ డాగ్స్ ఆగాయి. వాటి ఆధారంగా తదుపరి చర్యలపై అధికారులు సమీక్ష చేస్తున్నారు. అనుమానిత స్పాట్ లలో తవ్వకాలు చేపడుతున్నారు. మరో వైపు కన్వేయర్ బెల్ట్ కూడాపూర్తి స్థాయిలో వినియోగంలోకి రావటంతో సహాయచర్యలు వేగవంతమయ్యాయి. సొరంగంలో కూరుకుపోయిన మట్టి, బురదను తొలగిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వే నిపుణులతో ప్లాస్మాకట్టర్స్ ద్వారా టీబీఎం మిషన్ భాగాలు కట్ చేస్తూ వాటిని లోకో ట్రైన్ ద్వారా బయటికి తీసుకొస్తున్నారు. కానీ జీపీఆర్ అనుమానిత ప్రాంతాల్లో జరుపుతున్న తవ్వకాల్లో పెద్దఎత్తున సీఫేజ్ వాటర్ వస్తుండటంతో సహాయక చర్యలకు కొంత అవరోధం ఏర్పడుతుంది. మొత్తంగా టన్నెల్‌లో ఇరుకున్న వారి ఆచూకీని కనుగొనేందుకు అనేక చర్యలు చేపడుతున్నా ఇప్పటికీ 8 మంది ఆచూకీ దొరకపోవటంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
08.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





## గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కి మరింత ఆదాయం చేకూరుస్తాం

- మార్కెట్ కమిటి చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి వెల్లడి

**పెద్ద అంబర్ పేట్ ,విశాల భారతి:**
అబ్దుల్లాపూర్మెట్ మండలం బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పాలకవర్గం సమావేశంలో 2025 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ని పాలకవర్గం ఆధ్వర్యంలో ఆమోదం తెలిపి బడ్జెట్ ప్రతిపాదనలను అధికారులకు పంపించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిరైతుని సంతోషంగా ఉంచడమే ధ్యేయం అన్నారు. వచ్చే మామిడి సీజన్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, రైతులకు, ఏజెంట్లకు, కావలసిన కనీస సదుపాయాలు కల్పిస్తామని ఇప్పటికే అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి రైతులకు, వర్తకులకు సమన్వయము ఉండేలా చూస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ సిహెచ్.బాస్కరా చారి,మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్.శ్రీనివాస్,పాలకవర్గం సభ్యులు బండి మధుసూదన్ రావు,రఘుపతి రెడ్డి,జైపాల్ రెడ్డి,అంజయ్య,లక్ష్మి,నరసింహా,గోవర్ధన్ రెడ్డి,నవరాజ్,గణేశ్ నాయక్,మచ్చేందర్ రెడ్డి,వెంకటేశ్వర్లు గుప్తా,ఇబ్రహీం తో పాటు మార్కెట్ కమిటీ అధికారులు హర్ష,రాజ్ కుమార్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## రేపు వారసిగూడ గంగపుత్ర సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశం

**సికింద్రాబాద్, విశాలభారతి:**
వారాసిగూడ,గంగపుత్ర సంక్షేమ సంఘం 29వ సర్వసభ్య సమావేశం ఈనెల 9న ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు చల్లూరి సంజీవ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.కావున సభ్యులు సమయానికి విచ్చేసి సమావేశమును జయప్రదం చేయగలరని అయన కోరారు. సమావేశ స్థలము జెడ్ యం ఏసి ఫంక్షన్ హాల్ (గంగపుత్ర సంక్షేమ సంఘం పక్కన) సమావేశ అంశములు: దీపారాదన, ప్రార్థన, దివంగత సభ్యులకు నివాలి,అధ్యక్షుల ఉపన్యాసము,కార్యదర్శి నివేదిక,కోశాధికారి నివేదిక సభ్యుల ఆమెదం,చిట్టీల కార్యదర్శి నివేదిక,ఇంటర్నల్ ఆడిటర్ నివేదక, సభ్యుల సలహాలు, సూచనలు, నూతన ప్రతి పాదనలు, తీర్మానములు, 60, 1 75 సం॥లు పూర్తి చేసుకున్న వారికి సన్మానాలు, మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతి, 10 వ తరగతి, ఇంటర్మీడియేట్, డిగ్రీ, ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ పాసైన మెరిట్ విద్యార్థులు, వారి సర్టిఫికెట్ జిరాక్స్ 7వ తేది సాయంత్రము 6.00 గం|లలోపు సంఘంలో ఇవ్వవలెనని సంజీవ్ కోరారు.



## భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ సదుపాయం కల్పించాలి

- వాసవి,బ్లడ్ బ్యాంక్ కాలనీ వాసులు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి విజ్ఞప్తి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**
హయత్ నగర్ డివిజన్లోని శివారు కాలనిలైన వాసవి, బ్లడ్ బ్యాంక్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి కాలనీవాసుల సమస్యలపై ఆయా కాలనీలో పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు తమ కాలనీలో భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ సదుపాయం లేనందువల్ల మురుగునీరు మొత్తం కాలనీలోని కాళీ ప్రదేశాలలో చేరి విపరీతమైన దుర్వాసనతో పాటు, దోమలతో కాలనీవాసులు అనారోగ్య బారిన పడుతున్నారని కార్పొరేటర్ కి వివరించారు. అనంతరం కార్పొరేటర్ సంబంధిత ఏంటోమాలజీ సిబ్బందితో దోమల మందు పిచికారి చేయించడం చేయించారు. అదేవిధంగా వారు మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా బ్లడ్ బ్యాంక్ మరియు వాసవి కాలనీలో భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ సదుపాయం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ యొక్క కార్యక్రమంలో ఏంటోమాలజీ రవీందర్ , కుమార్ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## 10న గ్రూప్–1 ఫలితాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్న గ్రూప్స్ ఫలితాలకు సంబంధించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక ప్రకటన చేసింది. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలతో పాటు గతంలో నిర్వహించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పరీక్ష ఫలితాల తేదీలను శుక్రవారం ప్రకటించింది. ఆ షెడ్యూలు ప్రకారం.. గ్రూప్ 1 పరీక్షలో అభ్యర్థులు సాధించిన ప్రొవిజినల్ మార్కుల వివరాలను మార్చి 10న ప్రకటించనున్నారు. గ్రూప్ 2 పరీక్ష జనరల్ ర్యాంకింగ్ జాబితాను 11వ తేదీన, గ్రూప్ 3 జనరల్ ర్యాంకింగ్ జాబితాను మార్చి 14న విడుదల చేయనున్నారు. గతంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షల ఫలితాలను మార్చి 19న ప్రకటిస్తారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఉద్యోగ నియామకాలకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందుతున్న తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని టీజీపీఎస్సీ విజ్ఞప్తి చేసింది. అన్ని పరీక్షలనూ అత్యంత పారదర్శకంగా నిర్వహించామని, ఎలాంటి లోటుపాట్లకూ తావు లేకుండా ఫలితాలు ప్రకటిస్తామని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆయన వెల్లడించారు. ప్రతిభావంతులైన ఉద్యోగులను ఏంపిక చేయడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నామని.. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా చెప్తే, అలాంటివారి మాటలు నమ్మవద్దని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఎవరైనా ప్రలోభపెట్టే ప్రయత్నం చేస్తే.. 99667 00339నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని వెంకటేశం సూచించారు.

## కొడుకు చేతిలో తల్లి హతం



**విశాలభారతి, ఎల్కతుర్తి:**
సమాజంలో రోజురోజుకి మానవ సంబంధాలు కనుమారుతున్నాయి. అల్లరుముద్దుగా పెంచిన కన్న తల్లినే నరికి చంపాడు ఓ ప్రబుద్ధుడు. ఎల్కతుర్తి మండలం వీరనారాయణపురం గ్రామంలో తల్లి చదరం రేవతిని అప్పుచేసిందన్న భయంతో తల్లిని గొడ్డలితో నరికి చంపిన కుమారుడు చదరం విజయ్. వివరాల్లోకి వెళ్ళితే కొన్ని రోజులుగా చదరం విజయ్ భార్య సంసారానికి రావడం లేదు దానికి కూడా తల్లి చేసిన అప్పులే కారణమని స్థానికులు చెబుతున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.






## ఓయూలో ధర్నా చేస్తున్న దివ్యాంగుల అరెస్ట్

- ఉదయం అరెస్ట్ చేసిన పోలీసులు.
- 10 మంది విద్యార్థులపై కేసులు నమోదు
- దివ్యాంగ విద్యార్థుల అరెస్ట్ కు నిరసన
- ఓయూ విద్యార్థి సంఘాలు విసి ఛాంబర్ ముందు ధర్నా
- తక్షణమే విద్యార్థులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలి
- ఓయూ విద్యార్థి సంఘాల డిమాండ్

**విశాలభారతి, ఓయూ:**
ఓయూ పిహెచ్డి దివ్యాంగుల విద్యార్థుల నుంచి మెస్ బిల్స్ వసూల్ చేయడానికి నిరసనగా గురువారం మధ్యాహ్నం నుంచి వీసీ ఛాంబర్ లో విద్యార్థులు ధర్నా చేస్తున్నారు. అధికారుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో విద్యార్థులు గురువారం రాత్రి అంత వీసీ ఛాంబర్ లోనే తమ ధర్నా కొనసాగించారు. దీంతో వీసీ ఛాంబర్ లో ధర్నా చేస్తున్న దివ్యంగ విద్యార్థులను శుక్రవారం ఉదయం 7 గంటలకు ఓయూ పోలీసులు అరెస్ట్ చేసి ఆబ్జల్ గంజి పోలీసు స్టేషన్ కు తరలించారు. సాయంత్రం దివ్యాంగ విద్యార్థులకు మద్దతు విద్యార్థి సంఘాలు ఉద్యమించడంతో వారిని విడుదల చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం చీఫ్ సెక్యూరిటి ఆఫీసర్ ఓయూ పిఎస్ లో ఫిర్యాదు మేరకు 10 మంది దివ్యంగలపై కేసులు నమోదు చేసినట్లు ఓయూ ఇన్స్పెక్టర్ పేర్కొన్నారు.

**ఓయూ వీసీ కార్యాలయం వద్ద వామపక్ష విద్యార్థి సంఘాల ధర్నా..**
ఉస్మానియా యూనివర్సిటీలోని దివ్యాంగ స్కాలర్స్ ను శుక్రవారం ఉదయం అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఓయూ లెఫ్ట్ విద్యార్థి సంఘాలు విసి కార్యాలయం ముందు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా SFI రాష్ట్ర అధ్యక్షులు మూర్తి, జార్జిరెడ్డి PDSU రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్.ఎస్.నాగేశ్వర రావు, AISF ఓయూ కార్యదర్శి నెల్లి సత్యలు మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగ విద్యార్థులను అరెస్టు చేయించడం అత్యంత అమానుషమని అన్నారు. వారి సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాల్సిన వారే కేసులుకి పురిగొల్పడం దారుణమని పేర్కొన్నారు.విద్యార్థులతో తక్షణమే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని, వారిపై పెట్టిన కేసులని ఉపసంహరించుకోవాలని ఓయూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ లెఫ్ట్ విద్యార్థి సంఘాలు నేతలు లెనిన్, వెంకటేష్, క్రాంతి రాజ్, ఆశ్వన్ , కోటేశ్వర్ పాల్గొన్నారు.



**బిఆర్ఎస్వీ ఆధ్వర్యంలో**
యూజీసీ నిబంధనలను తుంగలో తొక్కి దివ్యాంగ విద్యార్థుల నుండి అక్రమంగా మెస్ బకాయిలను వసూలు చేయాలని ఓయూ అధికారులను చూస్తున్నారని బిఆర్ఎస్వీ విద్యార్థి నేతలు పేర్కొన్నారు. దివ్యాంగ విద్యార్థులను అక్రమ అరెస్ట్ FIR చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఓయూ పరిపాలనా భవన్ గెట్ ఎదుట బిఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.బీఆర్ఎస్వి విద్యార్థి విభాగం నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వి నాయకులు పెద్దమ్మ రమేష్,జీడీ అనిల్, నవీన్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, రాజేష్ నాయక్, మిథున్ ప్రసాద్, రామకృష్ణ, శ్రీకాంత్ ముదిరాజ్ పాల్గొన్నారు.



## 12 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- ఉదయం 11 గంటలకు గవర్నర్ ప్రసంగం
- బీఏసీ సమావేశంలో బడ్జెట్ తేదీ నిర్ణయం
- గెజిట్ విడుదల చేసిన అసెంబ్లీ కార్యదర్శి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 12 నుంచి ప్రారంభంకానున్నాయి. గవర్నర్ ఆదేశం మేరకు అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు శుక్రవారం గెజిట్ విడుదల చేశారు. తొలిరోజు ఉదయం 11 గంటలకు అసెంబ్లీ సమావేశ మందిరంలో శాసనమండలి, శాసనసభ సంయుక్త సమావేశంతో సమావేశాలను ప్రారంభిస్తారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగించనున్నారు. నిర్దేశిత సమయానికి సభ్యులంతా హాజరుకావాలని అసెంబ్లీ కార్యదర్శి కోరారు. అనంతరం బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సమావేశం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహిస్తారు? బడ్జెట్ ఎప్పుడు ప్రవేశ పెడతారు? తదితరాలను నిర్ణయిస్తారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, సమాధానం ఉంటాయి. ఎస్సీ వర్గీకరణ, విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను ఈ సమావేశాల్లోనే ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల పెంపుపైనా చర్చించి తీర్మానం చేయనున్నట్లు తెలుస్తోంది. మధ్యలో సమావేశాలకు స్వల్ప విరామం ప్రకటించి.. లోక్‌సభ సీట్ల అంశంపై అఖిల పక్షాన్ని తీసుకొని సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బృందం ఢిల్లీకి వెళ్లే అవకాశాలున్నట్లు సమాచారం. తిరిగొచ్చిన అనంతరం బడ్జెట్ సమావేశాలు కొనసాగుతాయి.

## మహిళకు శక్తి!

**తరువాయి భాగం**
ఆధ్యక్షతన జరిగే ఈ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు, అధికారులు పాల్గొననున్నారు. మహిళా సంఘాలు ఏడాది కాలంలో సాధించిన విజయాలతో పాటు మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తలపెట్టిన కార్యక్రమాలను ఇందిరా మహిళాశక్తి మిషన్2025లో పొందుపరిచారు. కాగా ఈ సభకు వివిధ జిల్లాల నుంచి వచ్చే మహిళల కోసం ప్రభుత్వం 600కుపైగా ఆర్టీసీ బస్సులను సెర్ప్ ఆధ్వర్యంలో అందుబాటులో ఉంచారు. మహిళలు ఇంటి నుంచి బయలుదేరినప్పటి నుంచి తిరిగి ఇంటికి సురక్షితంగా చేరుకునేవరకు సమన్వయం చేసుకునేలా ప్రత్యేక అధికారులను నియమించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సదుపాయాలను కల్పించనున్నారు. దూర ప్రాంతాల నుంచి మహిళలు వచ్చే అవకాశం ఉండటంతో రాత్రి ఏడున్నర గంటలలోపు సభను ముగించేలా సంబంధిత విభాగాలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

**మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగొద్దు: మంత్రి సీతక్క**
పరేడ్ గ్రౌండ్‌లో బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రి సీతక్క శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. సభకు వచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగు నీరు, విద్యుత్ నిరంతరాయంగా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సచివాలయంలో జిల్లా డీఆర్డీఏ, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి.. మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర మహిళలకు మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు ప్రజా భవన్‌లో అఖిలపక్షం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
రాష్ట్రాభివృద్ధికి నిధులు రాబట్టడంతోపాటు ప్రతిపక్షాల విమర్శలకు కళ్లెం వేసేందుకు సర్కారు సరికొత్త వ్యూహాన్ని ఎంచుకుంది. ఇందులో భాగంగా రేపు ప్రజాభవన్ లో ఆల్ పార్టీ మీటింగ్ నిర్వహిస్తోంది. ఈ సమావేశానికి రావాలని భట్టి క అన్ని పార్టీల ముఖ్యనేతలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి రావాల్సిందిగా కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు ఫోన్ చేసి ప్రత్యేకంగా ఆహ్వానించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హాజరవుతున్నారు. కేంద్రం వద్ద పెండింగ్ లో ఉన్న అంశాలపైనే ఈ మీటింగ్ లో ప్రధానంగా చర్చించనున్నారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన మంత్రి మోదీని, సంబంధిత కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. ముఖ్యంగా మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవనం, రీజినల్ రింగ్ రోడ్డు అంశాలపై విజ్ఞాపన పత్రాలు సమర్పించారు. పెండింగ్ ప్రాజెక్టులపై రాష్ట్రానికి చెందిన ఎంపీలు పార్టీలకతీతంగా పార్లమెంటు ఉభయ సభల్లో లేవనెత్తేలా వ్యూహరచన చేస్తోంది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
08.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily





## అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలి

- ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా శిక్షించాలి
- తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు చెప్యాల ప్రకాష్, కండె సుధాకర్

**విశాలభారతి,భీమదేవరపల్లి:**

అంబేద్కర్ విగ్రహాలను అవమానపరచడం సిగ్గుచేటని, జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం నంగునూరులో జరిగిన ఘటన ఇక ముందు మరెక్కడ జరగకూడదని, దుండగులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు చెప్యాల ప్రకాష్, కండె సుధాకర్ అన్నారు. విగ్రహాల పరిరక్షణకు ఒక ప్రత్యేకమైన చట్టాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి తొందూరి ఎల్లన్న, హుస్నాబాద్ మండలం అధ్యక్షులు బెజంకి బాబు, హుస్నాబాద్ మండలం ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకన్న, భీమదేవరపల్లి మండల నాయకులు ఎర్ర కార్తీక్, బెజ్జంకి వంశీ, వేముల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

**ఆర్మూర్,విశాలభారతి:**

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఆశన్న గారి జీవన్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఆర్మూర్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. నందిపేట్ మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షులు మాచ్చర్ల సాగర్ ఆధ్వర్యంలో నందికేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అర్చన అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.స్వామి వివేకానంద చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. జీవన్ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆక్షేపించారు ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెల్మల్ రాజన్న, సీనియర్ నాయకులు ఉ ల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గోజ్జా దేవేందర్, బాలగంగాధర్, సయ్యద్ హుస్సేన్, తాటికాయల సుభాష్, మాజీ సర్పంచులు సంద బాబు రాజ్,మాజీ ఉప సర్పంచ్ భారత్, రామారావు, యువ నాయకులు గాండ్ల సంతోష్, శీను, భూమేష్, సురేందర్, క్లబ్ గంగాధర్, ప్రవీణ్ నరేష్ ,సాగర్, విజయ్, రమణ పాల్గొన్నారు.



## తంగళ్ళపల్లి రమేష్‌ను పరామర్శించిన సిద్దిపేట జిల్లా గ్రంధాలయం చైర్మన్ కేడం

**విశాలభారతి, ఎల్కతుర్తి :**

హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ ఎల్కతుర్తి మండలంలోని జీలుగుల గ్రామంలో ఇటీవల మరణించినటువంటి పొన్నం యువసేన వ్యవస్థాపకులు తంగళ్ళపల్లి రమేష్ తండ్రిగారైన తంగళ్ళపల్లి లింగయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించిన సిద్ధిపేట జిల్లా గ్రంథాలయం చైర్మన్ కేడం లింగమూర్తి.ఈ కార్యక్రమంలో సిద్ధిపేట జిల్లా మాజీ కౌన్సిలర్ రవి జిలుగుల గ్రామం మాజీ సర్పంచ్ రావుల రమేష్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరు పాల్గొన్నారు.

## పట్టభద్రుల తీర్పు చిరసావహిస్తాను

- గెలిచిన అంజిరెడ్డికీ అభినందనలు
- స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి పిడిశెట్టి రాజు

**విశాలభారతి, ఎల్కతుర్తి:**



(కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం / ఇండోర్ స్టేడియం) మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికల్లో తనపై నమ్మకంతో విశ్వాసంతో ఓటు వేసిన పట్టభద్రులకు, అలాగే తన గెలుపు కోసం కష్టపడి పనిచేసిన అభిమానులకు సహచరులకు ఎల్లప్పుడూ ఋణపడి ఉంటానని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పిడిశెట్టి రాజు అన్నారు. ఎన్నికల లెక్కింపు ముగిసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మేధావుల తీర్పును గౌరవిస్తున్నామని తెలిపారు. గడిచిన అరెళ్లలో తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఉద్యమకారుడిగా తనను విద్యావంతులు, ఉద్యోగులు ఏంతో ఆదరించారని గుర్తుచేసుకున్నారు. జాతీయ బీసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో విద్యారంగ ఉద్యోగుల సమస్యలపై అనేక పోరాటాలు చేశామని తెలిపారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని అభిమానులు ఎవరు నిరాశ చెందవద్దని, అధైర్యపడవద్దని కోరారు. ప్రజాక్షేత్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.పట్టభద్రులకు,విద్యావంతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని పిడిశెట్టి రాజు స్పష్టం చేశారు.తనకు సహకరించిన మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ జిల్లాల అధికారులకు,ప్రభుత్వ సిబ్బందికి రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో తన ఓటమికి కారణాలను త్వరలో సమీక్షిస్తామని తెలిపారు. గెలిచిన అంజిరెడ్డికీ అభినందనలు తెలిపారు.

## నిజామాబాద్ పోలీస్ కమిషనర్ గా సాయి చైతన్య

**ఆర్మూర్,విశాలభారతి:**

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ గా 2016 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన పోతరాజు సాయి చైతన్య ను నియమించారు. సాయి చైతన్య ప్రస్తుతం యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీగా పనిచేస్తున్నారు. గతంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ గా పనిచేసిన కల్మేశ్వర్ హైదరాబాదులోని ట్రైనింగ్ సెంటర్ కు ఐదు నెలల క్రితం బదిలీ అయిన విషయం తెలిసిందే. కామారెడ్డి ఎస్పీగా ఉన్న సింధు శర్మ నిజామాబాద్ ఇంచర్జ్ సీపీగా కొనసాగారు.



# జనరిక్ మందులు వాడండి డబ్బులు ఆదా చేసుకోండి

- మల్కాజ్గిరి ఎంపీ ఈటెల పిలుపు

**సికింద్రాబాద్, విశాల భారతి :**

ప్రధానమంత్రి భారతీయ జన్ ఔషధీ పరియోజన స్కీములో భాగంగా ప్రధానమంత్రి జన్ ఔషధీ దివాస్ కార్యక్రమం మార్చి 1st నుండి 7 th వరకు అన్ని రాష్ట్రాలలో అన్ని కేంద్రాలలో ఒక ఉత్సాహంలాగా జరుగుతుంది. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కన్వీనర్ గోపురమణారెడ్డి, మాజీ సైనికుల విభాగం & జన్ ఔషధీ కేంద్రాల నిర్వహకులు పిఎం జన ఔషధీ దివాస్ ఏడవ వార్షికోత్సవ ముగింపు కార్యక్రమంలో మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జన్ ఔషధి గురించి లాభాలు, ఎంత తక్కువ రేటుకు వచ్చేది వివరించారు. డబ్బులు లేక మందులు కొనలేని పరిస్థితులలో ఉండే ప్రజలకి నరేంద్ర మోడీ ఒక దేవుడు లాంటి వాడు ఈ స్కీమును దేశమంతటా విస్తృతంగా కేంద్రాలు ఏర్పాటు చేసి కోట్లాది రూపాయలు ప్రజల ధనాన్ని వృధా కాకుండా కాపాడడం జరిగిందని అన్నారు. బ్రాండెడ్ మందులతో సమానంగా నాణ్యత కలిగిన మందులు మార్కెట్లో 50 నుండి 90% తక్కువ ధరలకు ఈ కేంద్రాలలో లభ్యం అవుతున్నాయని చెప్పారు.ఇప్పటికే కోట్లాది మంది ఈ జన్ ఔషధీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతున్నారని వివరించారు. అలాగే నరేంద్ర మోడీ ఆయుష్మాన్ భారత్ స్కీమ్ తీసుకొచ్చి లక్షలాది మందికి చికిత్స చేయిస్తున్నారని, భవిష్యత్తులో ఇంకా జన ఔషధీ కేంద్రాలు ఏర్పాటు చేసి, హైదరాబాదులో ఉండే ఐడిపిఎల్ కంపెనీని మళ్లీ పునర్ ప్రారంభించి ఇక్కడే మందులు తయారయ్యే విధంగా ప్రయత్నం చేస్తానని పార్లమెంట్ సభ్యులు రాజేందర్ హామీ ఇవ్వడం జరిగింది. ఐడిపిఎల్ లో తయారైన మందులు అతి త్వరలో ఈ చుట్టుపక్కల ప్రాంతాలకు అందుబాటులోకి వస్తాయని తెలియజేయడం జరిగింది. గోపు రమణారెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలను జన ఔషధిలో తెలంగాణ రాష్ట్రంలోని అత్యధికముగా మందులు అమ్మినందుకు కాను కేంద్ర ప్రభుత్వము పీఎంబీఐ సమస్త గోపు రమణారెడ్డికి గోపు లక్ష్మీ కి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ చేతుల మీదుగా మూమెంట్ అందజేయడం జరిగింది. నర్మదా మల్లికార్జున మాట్లాడుతూ మహిళలందరూ కూడా ఒక్క రూపాయికి ఒక్క ప్యాడ్ దొరకటం చాలా సంతోషకరం మహిళలు అందరు కూడా సానిటరీ ఫ్యాట్స్ జెన్ ఔసిధి కేంద్రంలో కొనుక్కొని డబ్బులు ఆదా చేసుకోవాలని ఆరోగ్యం సురక్షితంగా ఉండాలని దాదాపుగా దగ్గరలో వివిధ రకాలైన మందులు చిన్న ఔషధీ కేంద్రాలలో దొరుకుతున్నాయని అందుబాటులో ఉండి దగ్గర ఉన్న వాళ్ళందరూ కూడా తిరుమలగిరి బ్రాంచ్ ని సందర్శించి మందులు కొనుక్కొని డబ్బులు ఆదా చేసుకోవాలని నర్మదా మల్లికార్జున కోరాటం జరిగింది .అనంతరం మాజీ కంటోన్మెంట్ బోర్డ్ సభ్యురాలు నర్మదా మల్లికార్జున కి. ఈటెల రాజేందర్ మూమెంటో అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు , కార్యకర్తలు అభిమానులు, మహిళలు నర్సులు, జన ఔషధి సమస్త సిబ్బంది అనేకమంది పాల్గొన్నారు.



## మిలియన్ మార్చ్ డే ను గుర్తు చేసుకుందాం

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

**సికింద్రాబాద్, విశాలభారతి :**

మిలియన్ మార్చ్ డే ను గుర్తు చేసుకుందామని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో మార్చ్ 10 న మిలియన్ మార్చ్ డే నిర్వహించ తలపెట్టిన కార్యక్రమం సందర్భంగా జేఏసీ నాయకులు ప్రొఫెసర్ కోదండరాంను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిలియన్ మార్చ్ డే ను గుర్తు చేసుకోవడం అవసరమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా నాటి జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించి తెలంగాణ ఆకాంక్షను ఎలుగెత్తి చాటామని ఆ కార్యక్రమంలో వేలాది మంది ఉద్యమకారులను పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపారు. ఈనెల 10న హైదరాబాదులో ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే మిలియన్ మార్చ్‌డేను గుర్తు చేసుకుందామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ల రాం రెడ్డి, చర్చల చంద్రన్నప్రసాద్, లక్ష్మీకాంతమ్మ, అంజలి, సుచరిత, కే రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



## మిలియన్ మార్చ్ డే ను జయప్రదం చేద్దాం

- టియూ జేఏసి సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి

**సికింద్రాబాద్,విశాలభారతి :**

గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ డేను జయప్రదం చేయాలని టియు జేఏసి సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి అన్నారు. దీనికి సంబంధించిన కరపత్రంను ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి సంఘాల నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రఫుల్ రాంరెడ్డి మాట్లాడుతూ 2011 మార్చి 10 న సీమాంధ్ర దోపిడీ పాలన పై తెలంగాణ ప్రజలు తిరుగుబాటు జెండా ఎత్తిన రోజని, తెలంగాణ ప్రజలు తెగించి తెగువతో పోరాడారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ అకాంక్షలను, ఉద్యమకారుల గోడును మాజీ సీఎం కెసిఆర్ విస్మరించి తెలంగాణను విధ్వంసం చేశాడని మండి పడ్డారు. టియుజేఏసీ సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 250 గజాల ఇంటి స్థలం, రూ.30,000 గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి ఉద్యమకారుల వేదిక అధ్యక్షులు కంచర్ల భద్రి, ఎస్ ఎఫ్ ఐ అధ్యక్షులు మూర్తి, జార్జి రెడ్డి పిడిఎస్ యు అధ్యక్షులు ఎస్ నాగేశ్వర్ రావ్, సుమంత్, క్రాంతి, ప్రవీణ్, శివ, పత్తి పాటి లక్ష్మి కాంతం, చంద్రన్న ప్రసాద్, వి. యాదగిరి, డోలక్ యాదగిరి, స్వరూప, సుజ్జి, కె రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



## మెగా సిటీ హై స్కూల్ నందు ఘనంగా కల్చరల్ ఫెస్ట్

- ముఖ్యఅతిథిగా హయత్ నగర్ ఎంఈఓ శ్రీనివాసులు
- విద్యార్థులకు సంస్కృతి సాంప్రదాయ పట్ల అవగాహన అవసరం

**పెద్ద అంబర్ పేట, విశాలభారతి:**

హయత్ నగర్ మెగా సిటీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం శ్రీసితి కల్చరల్ ఫెస్ట్ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ నుండి 10వ తరగతి వరకు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హయత్ నగర్ ఎంఈఓ శ్రీనివాసులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు మన సంస్కృతి సాంప్రదాయాలను కట్టు బొట్టుతోపాటు మన ఆచారాలను విద్యార్థులకు అర్థమయ్యేలా తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా వారికి అర్థమయ్యేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు పాఠశాల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి యాస భాషాతో పాటు కట్టు బొట్లను అర్థమయ్యేలా వివిధ రకాల వేషధారణలతో విద్యార్థులు అలరించారు. ఫుడ్ ఫెస్టివల్ పేరుతో విద్యార్థులు స్వయంగా చేసిన వంటకాలను పాఠశాలలో ఆవిష్కరించారు. మన దేశ సంప్రదాయ వంటకాల మీద అవగాహన కలిగేలా పలువురుకి ప్రదర్శనలో స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గిన్నిస్ బుక్ రికార్డర్ వేణుగోపాల్ రెడ్డి, రిటైర్డ్ రైల్వే ఎంప్లాయ్ టీవీ రావు మెగాసిటీ హై స్కూల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి,అసిస్టెంట్ డైరెక్టర్ స్వాతి, ప్రిన్సిపల్ సంకోజ్ వాసు, వైస్ ప్రిన్సిపల్ స్వాతి, హై స్కూల్ ఇంచార్జ్ వెంకటరమణ తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు వారి తల్లి దండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని తెలిపారు.





## లిఫ్ట్ మరమ్మత్తులకు నిధులు ఇవ్వండి



**ఆర్మూర్, విశాలభారతి:**
లిఫ్ట్ మరమ్మతుల కొరకు నిధులు మంజూరు చేయాలని చైర్మన్లు పిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను హైదరాబాద్ లో కలిసి వినతి పత్రం అందజేశారు. సిహెచ్ కొండూరు లిఫ్ట్ పరిధిలోని ఉమ్మెడ శివారులో గల పైప్ లైన్ కొరకు నిధులు మంజూరు చేయాలని మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ ని కలిసిన వారిలో లిఫ్ట్ చైర్మన్లు మోర్తాడ్ బోజా రెడ్డి, ఉప్పరి ఓంకార్, జిలకర చిన్నయ్య, రమణ, లోక హన్మండ్లు, తదితరులు కలిశారు.



## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

**కోదాడ, విశాలభారతి:**
మునగాల మండల కేంద్రంలో గల జడ్. పి.హెచ్.ఎస్ హైస్కూల్ లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మార్చి 21 పరీక్షలు ప్రారంభం కానున్న సందర్భంగా కోదాడ శాసన సభ్యురాలు నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి పిలుపు మేరకు మునగాల కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు షేక్ పాషా ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రిని విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మునగాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల జైపాల్ రెడ్డి, కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసర్ల కోటయ్య ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోదాడ శాసన సభ్యురాలు నల్లమాద ఉత్తమ్ పద్మావతి వారిని మర్యాద పూర్వకంగా కలవడానికి వచ్చే సమయాల్లో శాలువాలు, పూల బొకేలు తీసుకొని రావద్దని వాటికి బదులు విద్యార్థులకి ఉపయోగపడే నోట్ బుక్స్ ఇతర సామాగ్రిని విద్యార్థులకు అందించాలని కోరారని అన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మునగాల మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కాలే సామెల్, రేణబోతు వీరారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తక్కెళ్ళపాటి సాయి, బోళ్ల రంగారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు అంజిరెడ్డి, చేగొండి శ్రీనివాస్, బుల్లెద్దు వెంకన్న ,రమేష్, వీరాచారి, బోనాల కోటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోహీర్‌లో మాదిగ డప్పుల మహా ప్రదర్శన

**కోహీర్:**
మండల కేంద్రమైన కోహీర్‌లో శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు కోహీర్ ఘండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ డప్పుల మహా ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కోహీర్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు రవి మాదిగ తెలిపారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు చౌకీ ప్రాంతంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం నుంచి కొత్త బస్టాండ్ వరకు డప్పుల ప్రదర్శనలతో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి మండలంలోని మాదిగలు, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలకు భారీగా తరలిరావాలని ఆయన తెలిపారు. జస్టిస్ షమీమ్‌అక్తర్ నివేదికలో ఉన్న లోపాలను



సరిచేసి ఎస్సీ జాబితాలోని అన్ని కులాలకు ఎస్సీ వర్గీకరణ ఫలాలు అందేలా ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.అలాగే త్వరలోనే జరగబోయే మంత్రివర్గ విస్తరణలో మాదిగ కులానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం కల్పించాలిన ఎమ్మార్పీఎస్ కోహీర్ మండల అధ్యక్షుడు రవి మాదిగ ప్రభుత్వాన్ని కోరారు.



## నాసా ప్రోగ్రాంలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

**రామగుండం, విశాలభారతి:**
మండలంలోని ఎన్.టి.పి.సి టౌన్షిప్ లో గల శ్రీ చైతన్య హై స్కూల్ విద్యార్థులు నాసా ఎన్.ఎస్.ఎస్ గెరార్డ్ కె. ఓ'నీల్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్ ప్రోగ్రామ్ లో పాల్గొన్నారు. రెండు టీంలు టీమ్ ఫేనీస్ 5 మంది విద్యార్థులు మరియు టీమ్ నెబ్యులా 8 మంది విద్యార్థులు విజయం సాధించారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులను మరియు వారికి ప్రోత్సాహాన్ని అందించినటువంటి నాసా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఎస్ వెంకట రమణ, ప్రోగ్రాం ఇంచార్జి రమేష్ కోడూరి నీ ఏ.జీఎం తిరుపాలు, అకాడమిక్ కోఆర్డినేటర్ జయ కుమార్, పాఠశాల ప్రిన్సిపల్ ఉదయ్ కుమార్ అభినందించారు. ఫలితాల పట్ల వైస్ ప్రిన్సిపల్ నమ్రత, డీన్ అనిల్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నరేంద్ర కుమార్ మరియు అధ్యాపక బృందం ఆనందం వ్యక్తం చేశారు. మునుపటి సంవత్సరంలో ఇద్దరు విద్యార్థినిలు అంజికా రాణా మరియు శ్రేయ దుబే యు.ఎస్.ఎ లోని లాస్‌ఏంజెల్స్ లో ప్రతిష్టాత్మకమైన ఐ.ఎస్.డి సి కాన్ఫరెన్స్ 2024లో పాల్గొన్నారు.

## పొన్నంపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

- హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చిట్టెంపల్లి ఐలయ్య,మాజీ అధ్యక్షులు ఊసకోయిల ప్రకాష్



**విశాలభారతి,భీమదేవరపల్లి:**
మంత్రి పొన్నం ప్రభాకర్ పై మండల బిజెపి నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోని దమ్ముంటే కేంద్రంలో అధికారంలో ఉన్న ఎంపీ బండి సంజయ్ కరీంనగర్ జిల్లాకు గాని, హుస్నాబాద్ నియోజకవర్గంలో కాని ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం వీర పోరాటం చేసిన మంత్రి పొన్నంపై వ్యంగ్యంగా స్థాయికి మించి మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఐలయ్య, మాజీ మండల అధ్యక్షులు ఊసకోయిల ప్రకాష్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గజ్జెల రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు జక్కుల అనిల్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు గనవేని కొమురయ్య, బొల్లంపల్లి రమేష్, చిట్కూరి రామచంద్రం సీనియర్ నాయకులు ఎదులాపురం తిరుపతి, గొల్లపల్లి రవీందర్,గ్రామ శాఖ అధ్యక్షుడు భాష, ఎన్ఎస్ఈ నాయకుడు తాళ్ల





## ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి..కాంగ్రెస్ పార్టీ నచ్చకపోతే వెళ్ళిపో

- కాంగ్రెస్ పార్టీని అవమానించిన ఎమ్మెల్యే మాకు అవసరం లేదు
- చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీని కించపరిస్తే ఊరుకోం..
- ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తే కార్యకర్తలు సహించరు
- 20 ఏళ్ల నుంచి పార్టీని, కార్యకర్తలను కాట శ్రీనివాస్ గౌడ్ కాపాడుతుండు
- పార్టీని మేమే నడుపుకుంటాం.. మేమే బతికించుకుంటాం
- కాంగ్రెస్ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాం
- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై మండిపడ్డ కాంగ్రెస్ నాయకులు

**పటాన్ చెరు,విశాలభారతి:**
ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి.. చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని అవమానిస్తావా..? కాంగ్రెస్ పార్టీ నచ్చకపోతే వెళ్ళిపో.. పార్టీని అవమానిస్తే ఊరుకోమని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై మండి పడ్డారు. కాంగ్రెస్ పార్టీని కించపరిచేలా మాట్లాడి ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. పార్టీ నచ్చకపోతే ఏ పార్టీ నుంచి వచ్చావో ఆ పార్టీలోకి వెళ్లొచ్చని కాంగ్రెస్ పార్టీకి, మాకు నీదేమాత్రం అవసరం లేదని కాంగ్రెస్ నియోజకవర్గం నేతలు తేల్చి చెప్పారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ మునిసిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని, పార్టీని కించపరిచేలా మాట్లాడారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, పటాన్ చెరు మండల అధ్యక్షుడు ఎల్. సుధాకర్ గౌడ్, సీనియర్ నాయకులు చంద్రారెడ్డిలు మాట్లాడారు. గుమ్మడిదల మండలం ప్యారానగర్ డంపు యార్డు సమస్య పరిష్కారానికి జేఏసీ సభ్యులు, మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వద్దకు వెళ్తే సహకరించాల్సింది పోయి దుర్భాషలాడారని ఆరోపించారు. సమస్యను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధి ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం, కాంగ్రెస్ పార్టీపై దుర్భాషలాడి ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరచడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉండడం ఇష్టం లేకపోతే ఏ పార్టీ నుంచి వచ్చావో ఆ పార్టీలోకి వెళ్లిపోవాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని కోరారు. ఎమ్మెల్యే తీరుపై కాంగ్రెస్ అధిష్టానానికి పిర్యాదు చేస్తామన్నారు. కష్ట కాలంలో గత 20 ఏండ్లుగా నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ పార్టీని కార్యకర్తలను కాపాడుకుంటూ వస్తున్నారని గుర్తు చేశారు. చెప్పిందంతా చెప్పి ఫ్రాబికేటెడ్ వీడియోస్ ద్వారా తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పార్టీ నచ్చితే ఉండండి నచ్చకపోతే వెళ్లిపోవచ్చని, కాంగ్రెస్ పార్టీని మేమే నడిపించుకుంటాం, మేమే బ్రతికించుకుంటాం అని కాంగ్రెస్ నేతలు అన్నారు. ప్యారానగర్ జేఏసీ సెక్రటరీ రాజు గౌడ్ మాట్లాడుతూ డంపు యార్డు విషయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్య పరిష్కారానికి సహకరించాలని తాము కోరితే.. ఇష్టారీతిగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ దుర్భాషలాడి నిరాశ పరిచారన్నారు. ఇది వాస్తవమేనని, నేను ప్రత్యక్ష సాక్షినని ఆయన స్పష్టం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు సమస్యను మీరే పరిష్కరించాలని అడిగితే కాంగ్రెస్ పార్టీని కించపరుస్తూ, నాది కాంగ్రెస్ పార్టీ కాదని, బీఆర్ఎస్ పార్టీ అని ఏం చేసుకుంటారో చేసుకోండి, నా చేతిలో ఏమీ లేదన్నారని చెప్పారు. ఈ సమావేశంలో పటాన్ చెరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్ గౌడ్, అమీన్ పూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి.శశిధర్ రెడ్డి, భ్రమరాంబిక మల్లికార్జున దేవస్థానం చైర్మన్ బైసా సుధాకర్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీహరి, జైపాల్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



## సూర్యాపేట మిర్చి యార్డులో ప్రెస్ క్లబ్ భవనాన్ని నిర్మించాలి

- టిఎస్ జేఏ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి యాదగిరి.

**సూర్యాపేట,విశాలభారతి:**
సూర్యాపేట జిల్లా కేంద్రంలో గల పాత మిర్చి యార్డులో అన్ని సౌకర్యాలతో కూడిన పక్కా జర్నలిస్టు భవనాన్ని నిర్మించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్ కు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి యాదగిరి కమిటీ సభ్యులకు కార్డులు పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్ని జిల్లా కలెక్టర్ లకు ఆర్డిఓ లకు అంబేద్కర్ విగ్రహాలకు గాంధీ విగ్రహాలకు తెలంగాణ తల్లి విగ్రహాలకు వినతి పత్రం ఇచ్చే కార్యక్రమం చేపట్టామని తెలిపారు.ముఖ్యంగా జర్నలిస్టులు ప్రెస్ క్లబ్ భవనాలు లేక చెట్ల కింద టీ స్టాలలో,హోటలలో ప్రైవేట్ భవనాల కింద గడపాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా వర్కింగ్ లో ఉన్న ప్రతి ఒక్క జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు,హెల్త్ కార్డులు, పోలీసు భరోసా కార్డులు,ఇంటి స్థలాలు లేదా పక్క ఇంటి నిర్మాణాలు చేపట్టి ఇవ్వాలని యాదగిరి డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించేంతవరకు పోరాటం కొనసాగిస్తామని అని యూనియన్ లతో కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సోషల్ మీడియా ఇన్చార్జి ధూపాటి శ్యాంబాబు, రాష్ట్ర కోశాధికారి కొరివి సతీష్ యాదవ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దుర్గం బాలు, సూర్యాపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడి రవి, సూర్యాపేట జిల్లా సహాయ కార్యదర్శి తిరుపతి శ్రీనివాస్, సూర్యాపేట జిల్లా కోశాధికారి లంకెపల్లి రమేష్, పెన్ పహాడ్ మండల అధ్యక్షుడు పడిశాల నాగయ్య పాల్గొన్నారు




## మహిళలు అన్ని రంగాలలో ముందు ఉండాలి

- మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీ పడాలి.
- అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలలో
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్.

**సూర్యాపేట,విశాలభారతి:**
మహిళలు అన్ని రంగాల్లో పోటీపడినప్పుడే చరిత్రను మార్చిన వారు అవుతారని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ను పురస్కరించుకొని కలెక్టరేట్ సమావేశ మందిరం లో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి తో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా మహిళమణులకు, జిల్లా మహిళా అధికారులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ మహిళా దినోత్సవం అంటే ముందుగా గుర్తొచ్చేది అమ్మ అని, అమ్మను స్మరించుకోవడం చాలా ఆనందంగా ఉందని, మహిళా శక్తి గురించి మాటలు, పాటలు, పద్యాల రూపంలో చెప్పటం చాలా ఎమోషనల్ ఉన్నదని ఉన్నత స్థాయిలో ఉన్న ప్రతి ఒక్కరూ అమ్మను గుర్తుంచుకోవాలని అన్నారు.ఈ రోజుల్లో మహిళలు అని రంగాలలో ముందు ఉన్నారని వ్యవసాయం, వృత్తి నైపుణ్యం, పారిశ్రామిక , వ్యాపార రంగాలలో, కళలలో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని ఇలాగే అన్ని రంగాల్లో ముందుండి జిల్లాను అభివృద్ధి పథంలో ముందు ఉంచాలని కలెక్టర్ కోరారు. నేటి మహిళా దినోత్సవం థీమ్ "మహిళలకి అలాగే బాలికలందరికి హక్కులు, సమానత్వం, సాధికారిత"ను సాధించుటకు థీమ్ పై ఏర్పాటు చేసిన సిగ్నేచర్ క్యాంపెయిన్ పై జిల్లా కలెక్టర్, అధికారులు సంతకం చేశారు.తదుపరి మహిళా అధికారులను జిల్లా కలెక్టర్ సన్మానించారు. అలాగే మహిళలకి నిర్వహించిన ఆటలపోటీలలో గెలిచిన సిబ్బందికి బహుమతులు ఇచ్చినారు .ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి శాఖ అధికారి నరసింహా రావు, షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి కే. లత, పి డి మెప్మా అధికారిని వై. రేణుక దేవి, టౌన్ ప్లానింగ్ అధికారిని వి .మాధవి, జిల్లా లీగల్ కౌన్సిల్ అడ్వకేట్ వాణి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ కే.మాధవి, జిల్లా వైద్యాధికారి కోటాచలం తదితరులు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
08.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



నేరేడుచర్ల, విశాలభారతి: మండల కేంద్రంలోని పులగం బండ తండా ప్రాథమిక పాఠశాల యందు స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకోన్నారు. ఇందులో భాగంగా కలెక్టర్గా బానోతు దీక్షిత, డీఈఓ గా బానోతు అలేఖ్య,ఎంఈఓ గా బానోతు నాని,ఎమ్మార్వో గా బాణోతుసుశాంత్, ప్రధానోపాధ్యాయులుగా బానోతు రామ్ చరణ్,మరియు ఉపాధ్యాయులుగా పిల్లలు అలరించారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ ఉపాధ్యాయులు వరప్రసాద్, మరియు ఉషారాణి, అంగన్వాడీ టీచర్ సైదమ్మలు పాల్గొన్నారు.



## పంచాయితీ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలి

- ఎంపీడీవో కు వినతి పత్రం అందజేసిన కార్మికులు
- ఎంపీడబ్ల్యూ మండల అధ్యక్షులు మొలుగూరి ప్రేమ్ కుమార్

సైదాపూర్ ,విశాలభారతి: సైదాపూర్ మండల పంచాయతీ సిబ్బంది రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం గ్రామపంచాయతీ సిబ్బందికి ఇచ్చిన హామీల ప్రకారం వేతనాలు చెల్లించాలని వేతనాల చెల్లింపుకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి చేయాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో భూక్యా యాదగిరి కీ వినతి పత్రం అందజేశారు.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12769 గ్రామ పంచాయతీలలో వివిధ రకాల పారిశుద్ధ్య పనులు చేస్తూ గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు సేవలందిస్తున్న పంచాయతీ కార్మికుల శ్రమను గుర్తించి ప్రభుత్వ ఉద్యోగుల వలె గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా కార్మికులకు వేతనాలు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన ప్రకటన చేయడంతో పంచాయతీ కార్మికుల కుటుంబాలలో ఈ ప్రకటన ఆనందోత్సాహాన్ని నింపింది. కానీ ప్రభుత్వం 2025 జనవరి 1 నుండి కార్మికుల వేతనాలను చెల్లిస్తామని ఇచ్చిన హామీ ప్రకారం కార్మికుల వేతనాలు చెల్లించలేదు రెండు నెలలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కాకపోవడంతో కార్మికులు నిరాశకు గురవుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పంచాయతీ కార్మికుల వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం పై ఒత్తిడి పెంచాలని కార్మికుల బకాయి వేతనాలు చెల్లింపులలో జరుగుతున్న జాప్యాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎస్టిఓ లలో నిలిచి పోయిన కార్మికుల వేతనాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలి. సిబ్బంది బకాయిలు చెల్లించాలని వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని రెండవ పి ర్ సి పరిధి లోకి గ్రామపంచాయతీ సిబ్బందిని తీసుకురావాలి జీవో నెంబర్ :60 ప్రకారం వేతనాలు కేటగిరీల వారిగా చెల్లించాలని డిమాండ్ చేశారు.



## అర్హులైన పేదలందరికీ ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి.

సూర్యాపేట,విశాలభారతి: అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. శుక్రవారం11 వార్డు రాయినిగూడెంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ పథకం ద్వారా ఇండ్లు కట్టిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్న నేటికీ ఏ ఒక్కరికి ఇల్లు నిర్మించిన పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలు సొంత ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మండలానికి ఒక గ్రామంలో మాత్రమే ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని చెప్పడం సమంజసం కాదన్నారు. అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఇంటి స్థలం లేని వారికి కొనుగోలు చేసి ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఉచిత బస్సు మినహా ఏ ఒక్క హామీ నేటికి అమలు కాలేదు అన్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, చేతి వృత్తుదారుల పింఛన్లు పెంచుతామని చెప్పిన ప్రభుత్వం నేటికీ పెంచలేదన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి 12000 ఇస్తామని చెప్పిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. రైతాంగానికి రైతు భరోసా, రుణమాఫీ నేటికి పూర్తి కాలేదు అన్నారు. సన్నధాన్యానికి కింటాకు 500 రూపాయలు బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ ఏ ఒక్క కింటాకు బోనస్ ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రజా సమస్యలను పరిష్కరించాలని లేనియెడల ప్రజా సమస్యలపై అలుపెరుగని ఉద్యమాలు నిర్మిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి, ఐద్వా జిల్లా కోశాధికారి మేకన బోయిన సైదమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ధనియాకుల శ్రీకాంత్, రైతు సంఘం ఉపాధ్యక్షురాలు కొప్పుల రజిత, ఐద్వా నాయకురాలు గంగమ్మ, మల్లమ్మ, వెంకటమ్మ, కవిత, మంజుల, స్వాతి పాల్గొన్నారు.



## ఆక్స్ఫర్డ్ పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు

విశాలభారతి, చిగురుమామిడి: చిగురుమామిడి మండలం ఇందుర్తీ గ్రామంలోని ఆక్స్ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న మహిళ ఉపాధ్యాయురాల్లను ఆయాలను పూల బొకెతో మరియు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అప్పాల సమ్మయ్య మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల కంటే భారతదేశంలో స్త్రీలకు ప్రత్యేకమైనటువంటి గౌరవం ఉంటుంది. మాతృదేవోభవ అని మనదేశంలో కన్నతల్లిని మొదటి దేవత గా పూజించడం జరుగుతుంది. పిల్లలందరూ కూడా భవిష్యత్తులో స్త్రీలను గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కూన సంపత్ మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మంజుల. సంధ్య. సమత. రాధిక. జరీనా. సంగీత కుజుర్. జ్యోతిప్రవకుల్లు. చాందిని నాయక్. సావిత్రి మాలిక్. సుస్మిత మరియు పిల్లలు పాల్గొన్నారు..








## కరెంట్ షాక్‌తో విద్యార్థికి తీవ్ర గాయాలు..

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

శేరిలింగంపల్లి,విశాలభారతి: విద్యుత్ షాక్ తో విద్యార్థి తీవ్రంగా గాయపడిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.చందానగర్ లోని రెయిన్బో స్కూల్లో ఆరవ తరగతి చదువుతున్న గౌరీ, స్నేహితురాలితో కలిసి ఆడుతుండగా షటిల్ కాక్ విద్యుత్ తీగల పై పడింది. ఇనుపరాడు సహాయంతో కాక్ తీసేందుకు ప్రయత్నిస్తుండగా విద్యుత్ షాకు గురైంది. షాక్ కు గురైన గౌరీని స్థానికులు గమనించి ఓ ప్రైవేట్ ఆసుపత్రి తరలించారు.కాగా గౌరీ తల్లిదండ్రులు తమ పాప స్కూల్లో ఉందని,ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పాపను స్కూల్ నుంచి బయటకు ఎలా పంపిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.వారం రోజుల క్రితం విద్యుత్ షాకు గురైన గౌరీ గురించి స్కూల్ యాజమాన్యం పట్టించుకోలేదని ,పోలీసులు పిలిచినా రావడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని,చేతులతో పాటు కడుపుకు తీవ్ర గాయాలయ్యాయని వారం రోజులుగా ఐసీయూలో చికిత్స పొందుతుందన్నారు.రెయిన్బో స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తమ పాపకు ఇలాంటి పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజులగా ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాల్ అందుబాటులోకి రాకుండా తప్పించుకు తిరుగుతున్నారంటూ వాపోయారు.గౌరీ తండ్రి క్యాన్సర్ తో పోరాడుతున్నాడని,కూతురు కరెంట్ షాక్ తో ప్రాణాలతో పోరాడుతుండడం తో తల్లి మనోవేదనకు గురవుతోంది. గౌరీని స్కూలుకు తీసుకువెళ్లడం ఇబ్బంది అవుతుందని ఇటీవలే స్కూల్ ట్రాన్స్పోర్ట్ ఫెసిలిటీ కోసం డబ్బులు చెల్లించిట్లు తల్లి సంపూర్ణ తెలిపారు. సంఘటన జరిగిన రోజు ఉదయం స్కూల్ వ్యాన్ లోనే గౌరీ వెళ్ళిందని, సాయంత్రం వ్యాన్ చెడిపోయిందని నడుచుకుంటూ వెళ్ళమని స్కూల్ యాజమాన్యం తెలిపారు అన్నారు. వ్యాన్ పాడైన విషయాన్ని సైతం తమకు తెలియజేయకుండా పాపను ఒంటరిగా వెళ్ళమనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. పాపకు న్యాయం చేసే వరకు స్కూల్ యాజమాన్యంతో పోరాటం చేస్తామని తెలిపారు.





## జీవితాన్నే ప్రజా పోరాటంగా మలుచుకున్న దళిత బిడ్డ

- పోదెం వీరయ్యకు ప్రియ శిష్యుడు

మణుగూరు, విశాలభారతి: యువ విద్యార్థి నాయకులను భుజం తట్టి ముందుకు నడిపి, జిల్లాలో ఇక కనుమరుగై పోతుందనుకున్న కాంగ్రెస్ పార్టీని తన భుజాలపై నడిపించాడు, దూరదృష్టితో పనిచేసే వాళ్లు, మార్పు కోసం పరితపించేవాళ్లు చాలా తక్కువ మంది ఉంటారు. ఆ కోవలో ముందుండేది పినపాక నియోజకవర్గం దుగినే పల్లి గ్రామానికి చెందిన బోడా రమేష్ అతని వ్యక్తిత్వం,కాంగ్రెస్ పార్టీకి పనిచేసే విధానంలో అతనికి ఎవరూ సాటిరారు. తన నైపుణ్యాన్ని సానపెట్టుకొని, శక్తియుక్తులను ఉపయోగించుకొని, బలహీనతలను అధిగమించి, వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకొని జిల్లాలో దళిత యువకుడిగా, తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి చైర్మన్ పొదెం వీరయ్య, తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క శిష్యుడిగా బాటలో నడుస్తున్నాడు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అరుదైన అస్త్రం విద్యార్థి రాజకీయాలనుంచి చురుకైన వ్యక్తిగా, విషయ పరిజ్ఞానం కలిగిన నాయకుడిగా జిల్లా కాంగ్రెస్ కు అత్యంత నమ్మిన బంటుగా ప్రతిపక్షాలు అల్లిన పద్మవ్యూహలని చేధించే అభిమన్యుడిగా వ్యక్తిగత ప్రచారాలకు, హంగులు ఆర్భాటాలకు దూరంగా ఉంటూ, కాంగ్రెస్ పార్టీ నీ బలోపేతం చేస్తూ నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారం కోసం తన జీవితాన్నే ప్రజా పోరాటంగా మలుచుకున్నాడు.

## స్వచ్ఛంద సంస్థ పేరుతో డబ్బులు వసూళ్లు

డోర్నకల్, విశాలభారతి: సురక్ష లైఫ్ కేర్ సొసైటీ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఫుల్ బాడీ స్కానింగ్ శిబిరం పేరుతో మరిపెడ మండలం, వీరారం గ్రామంలోని పాత పంచాయతీ భవనంలో శిబిరాన్ని ఏర్పాటు చేసి, ఉచిత వైద్యం పేరుతో గ్రామాల్లో ప్రచారం చేసి, ఓ చిన్న పరికరం సాయంతో శరీరంలో ఉండే అన్ని రకాల రుగ్మతలను గుర్తిస్తుందని చెబుతూ పెద్ద పెద్ద రోగాల పేర్లు చెబుతూ భయభ్రాంతులకు గురి చేస్తూ అమాయక ప్రజలకు సిరప్ లు మందులు అంటగడుతున్నారు. ఇప్పటికే ఈ స్వచ్ఛంద సంస్థ పేరుతో మరిపెడ మండలంలోని గిరిపురం, తానచర్ల, వెంకంపాడు, ఆనేపురం,చిల్లంచర్ల,ఎల్లంపేట అబ్బాయిపాలెం ,గాలివారిగూడెం,బీచ్ రాజు పల్లి గ్రామాలలో గత రెండు నెలలుగా క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలు చేసే వారికి ఎలాంటి విద్యా అర్హతలు లేకపోవడంతో పాటు, వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ మనిషిలో ఉండే పెద్ద పెద్ద రోగాల పేర్లు చెబుతూ,అమాయక గ్రామీణ ప్రజలకు మందులు అంటగడుతున్నారు.వీరారం గ్రామంలో పరీక్ష చేయించుకున్న ప్రజలను వివరణ కోరగా, మాకు ఫ్రీ క్యాంప్ అని చెప్పి మొత్తం బాడీ చెకప్ పేరుతో, గత 12 సంవత్సరాలుగా మీ శరీరంలో ఉన్న అనేక ఆరోగ్య సమస్యలను చెబుతామని స్కానింగ్ సెంటర్లో ఉండే చిన్న పరికరంతో టెస్ట్ చేస్తూ మీ శరీరంలో పలు రకాల ఆరోగ్య సమస్యలు ఉన్నాయని మందులు రాసి వారే మాకు 600 ,700 కు అంటగడుతున్నారని వాపోయారు.



## హామీ ప్రకారం వేతనాలు చెల్లించాలి

గరిడేపల్లి, విశాలభారతి: సిఐటియు పంచాయతీ కార్మికులకి గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా కార్మికుల వేతనాలు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకైన ప్రకటన చేయటం తో కార్మికుల కుటుంబాల్లో ఆనందాలు జరుపుకున్నారని సిఐటియు జిల్లా నాయకులు అన్నారు జనవరి ఒకటో తారీకు నుండి ప్రతినెలా కార్మికుల వేతనాలు చెల్లిస్తానని హామీ ఇచ్చి ఆ హామీ ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని యాకూబ్ అన్నారు గత మూడు నెలలుగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు లోనైనా కార్మికుల వేతనాల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి ఇప్పటికైనా సమస్య పరిష్కారం చేయాలని అన్నారు ఎస్టీవోలులో నిలిచి పోయిన కార్మికుల వేతనాలు అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు పంచాయతీ కార్మికులు ఏదైనా ప్రమాదంలో చనిపోతే వారికి ఎక్స్ గ్రేషియా 10 లక్షలు ఇవ్వాలని కుటుంబాలు ఒకరికి అర్హులైతే ఉద్యోగం ఇవ్వాలని పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు 51 జీవోలు రద్దుచేసి కార్మికులను అందర్నీ పర్మినెంట్ చేయాలని కనీస వేతనం 26000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోపగాని సత్యం, ఎనుముల హరీష్, చిటికెల రాజు బాలకృష్ణ, వెంకటయ్య, సైదులు నాగరాజు, సతీష్ పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు.

## తెలంగాణ పోలీసింగ్ వీక్యూటీ సిస్టమ్తో కేసుల క్లియరెన్స్

- విజిబుల్ పోలీసింగ్, క్విక్ రెస్పాన్స్, టెక్నాలజీపై పోలీసులకు అవగాహన
- అడ్డగూడూరు స్టేషన్ కు త్వరలో కొత్త బిల్డింగ్ నిర్మిస్తాం
- రాచకొండ సీపీ సుధీర్ బాబు



అడ్డగూడూరు, విశాలభారతి: తెలంగాణ పోలీసింగ్ వీక్యూటీ సిస్టమ్ తో కేసులను క్లియరెన్స్ చేస్తున్నట్టు రాచకొండ సీపీ జి.సుధీర్ బాబు చెప్పారు. ప్రజలకు బెటర్ సర్వీస్ ఇచ్చేందుకు ఈ విధానం అమలు చేస్తున్నామని, పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయడంతో పాటు విజిబుల్ పోలీసింగ్, క్విక్ రెస్పాన్స్, టెక్నాలజీ (వీక్యూటీ) ద్వారా కేసులను కూడా పరిష్కరిస్తున్నామని తెలిపారు. యాదాద్రి జిల్లా అడ్డగూడూరు పోలీస్ స్టేషన్ ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా విజిట్ చేశారు. స్టేషన్లో రికార్డులు పరిశీలించి కేసుల వివరాలు, స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామాల పరిస్థితి, స్టాఫ్ కు ఉన్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ లేటెస్ట్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ పై పోలీసులకు చాలా వరకు అవగాహన ఉందని, వారిని మరింత అప్ డేట్ చేసేందుకు అవసరమైన ట్రైనింగ్ ఇప్పిస్తామన్నారు. కేసులపరిష్కారం కోసం టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతుందని, అందుకు అవసరమైన ఎక్విప్మెంట్ను స్టేషన్లకు అందిస్తున్నట్టు చెప్పారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
08.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలి

**గరిడేపల్లి, విశాలభారతి:**

విద్యార్థులు తమ ఉన్నత లక్ష్యాన్ని విద్యార్థి దశలోనే ఏర్పరుచుకోవాలని గరిడేపల్లి మండల గుండాలమిట్ట ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెతావత్ రవినాయక్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపకరిస్తాయని అన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.కె షరీఫ్, సురేష్ రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆకాశమే హద్దుగా మహిళలు ఎదగాలి

- అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్

**కూకట్ పల్లి,విశాలభారతి:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మూసాపేట వై జంక్షన్ లోని అభినందన్ గ్రాండ్ హోటల్ లో సాయి అలేఖ్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సాయి అలేఖ్య సంస్థ అధ్యక్షురాలు అరుణ ను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఆకాశం సగం అవకాశాల్లో సగం ఇవ్వమనే స్థాయి నుంచి ఆకాశమే హద్దుగా ఎదిగిన మహిళ తీరు అద్భుతమని కొనియాడారు. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్ష పదవికి సైతం పోటీ పడే స్థాయికి మహిళ ఎదగడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి,తూము వేణు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు,ఏఎంసీ చైర్మన్ పుష్ప రెడ్డి,పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం శుభాకాంక్షలు

- రాజకీయ రంగంతోపాటు అన్నిరంగాల్లో బలమైన శక్తిగా మహిళలు ఎదగాలి
- అబ్దుల్లాపూర్మెట్ ఎంపీడీవో శ్రీవాణి రెడ్డి



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

రాజకీయ రంగంతోపాటు అన్నిరంగాల్లో బలమైన శక్తిగా మహిళలు ఎదగాలని అబ్దుల్లాపూర్మెట్ ఎంపీడీవో శ్రీవాణి రెడ్డి పేర్కొన్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాలు సొంతగా పాలన చేసేలా మహిళలు ఎదగాలని అన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు సమాన వేతనాలు ఉండాలన్న లక్ష్యంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని , మహిళల కష్టానికి తగిన ఫలితం ఉండాలన్నదే మహిళా దినోత్సవ ఆవిర్భావానికి కారణంగా నిలిచిందన్నారు. భూగర్భం నుంచి అంతరిక్ష రంగం వరకు అన్ని రంగాల్లో మహిళలకు అవకాశాలు రావాలని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు.

## నేను ఎవరిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి
- ఫ్యాబ్రికేటెడ్ వీడియోలతో దుష్ప్రచారం అర్థరహితం
- జర్నలిజానికి మచ్చ తెచ్చేలా వ్యవహరించొద్దు
- ప్యారా నగర్ డంపు యార్డు విషయంలో ప్రజలకు సంపూర్ణ మద్దతు



**పటాన్ చెరు,విశాలభారతి:**

ఫ్యాబ్రికేటెడ్ వీడియోలతో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్యారా నగర్ డంపు యార్డు విషయంలో స్థానిక జేఏసీ నాయకులతో జరిగిన సమావేశంలో తాను కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఒక వీడియో వైరల్ కావడం పై ఆయన స్పందించారు. డంపు యార్డు విషయంలో జేఏసీ నాయకులతో మాట్లాడుతూ..పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ గుమ్మడిదల ప్రజలకు సంపూర్ణ మద్దతు అందిస్తున్నారని వారికి సూచించడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో తాను కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఒక వీడియోను సృష్టించి కొన్ని యూట్యూబ్ ఛానల్స్ ప్రచారం చేయడం పట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తన వివరణతో పాటు కనీసం అందులో పాల్గొన్న వారి వివరణ తీసుకోకుండా వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా వార్తలు ప్రసారం చేయడం సరి కాదని తెలిపారు. ఏ అంశంపైనైనా కుండబద్దలు కొట్టినట్లు మొహమాటం లేకుండా తన అభిప్రాయాన్ని చెప్పడం అందరికీ తెలిసిన విషయమేనని..ఇలాంటి ఫ్యాబ్రికేటెడ్ వీడియోలను ప్రసారం చేస్తే ప్రజల్లో జర్నలిజంపై నమ్మకం పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై న్యాయపరంగా ముందుకు వెళ్తామని తెలిపారు.

## అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటేల్

**మణుగూరు, విశాలభారతి;**

అర్హులు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటేల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన, పెండింగ్ ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులు, ధరణి దరఖాస్తులపై సంబంధిత అధికారులతో టెలికాన్ఫిరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే ఎంపిక చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శిలు సమన్వయంతో పనిచేసే దరఖాస్తులు పరిశీలన చేపట్టాలన్నారు. ఎల్ వన్, ఎల్ టు,ఎల్ త్రీ లిస్టులను తయారు చేయాలని ఆదేశించారు. నివేదికలు ఆమోదం పొందిన వెంటనే ఆన్లైన్ చేయాలని ఆదేశించారు. ఎల్ వన్ లో అర్హత లేని వారిని పరిశీలించి తొలగించాలని, తొలగించడానికి గల కారణాలను నమోదు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కు అర్హత కలిగి ఉండి ఎల్ వన్ జాబితాలో పేరు రాని అర్హుల పేర్లను కూడా నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా ఎల్ టు మరియు ఎల్ త్రీ లో పేర్లు పొందుపరచడానికి గల కారణాలను కూడా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు.



అమ్మవారికి అభిషేకం చేస్తున్న భక్తులు.



కల్కి భగవాన్ జన్మదిన వేడుకలో పాల్గొన్న భక్తులు.

## ఘనంగా కల్కి భగవాన్ జన్మదిన వేడుకలు

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**

మియాపూర్ మదినగూడ లోని అమ్మ భగవాన్ ఆలయంలో కల్కి భగవాన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఆలయ వ్యవస్థాపకులు కొరిపల్లి రాఘవరావు, సంధ్యాదేవి దంపతులు తొలి పూజ నిర్వహించారు.నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఈ కార్యక్రమానికి తరలి వచ్చారు.భజనలు, ప్రత్యేక పూజలతో పాటు పాదుకాభిషేకం,అన్నదానం, ప్రసాదాల వితరణ కార్యక్రమాలను నిర్వహించారు.అనంతరం శివ కార్యక్రమాల్లో అనాథ ఆశ్రమానికి బియ్యంతో పాటు నిత్యవసర వస్తువులను అందజేశారు.అరవింద్ దాసాజీ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు అన్నపూర్ణ,తులసి,రాజా రవీందర్,తారక్,రఘు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్
- కుటుంబానికి మూలం మహిళా
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

మహిళలు అన్ని రంగాలలో సాధికారత సాధించినప్పుడే నిజమైన మహిళా దినోత్సవం అని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణ రెడ్డి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మార్పు అనేది ఇంటి నుండే ప్రారంభం కావాలని అన్నారు. కుటుంబానికి మూలం కుటుంబంలో ఉన్న మహిళా అని, కుటుంబంలోని ప్రతి విషయంలో మహిళ సమతుల్యత కలిగి ఉంటుందని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో నేటికీ మహిళలను తక్కువగా చూడటం జరుగుతున్నదని, ప్రస్తుతం మహిళలకు చదువుపరంగా, ఆర్థికపరమైన విషయాలలో సమానంగా అవకాశాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. అబ్బాయిలను అమ్మయిలను సమానంగా పెంచాలని, పిల్లలకు విలువలతో కూడిన విషయాలు నేర్పించాలని అన్నారు. మహిళలు తమ ఆరోగ్యం పై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మహిళలకు అందించే ప్రతిఫలాలను మహిళలు అందిపుచ్చుకునేలా ప్రభుత్వరంగంలో ఉన్న మనందరం కృషి చేయాలన్నారు. జిల్లాలో 1/3 వంతు మహిళా అధికారులు పని చేస్తున్నారని, జిల్లాను ముందుకు తీసుకెళ్లడంలో మహిళా అధికారుల సహకారం ఎంతైన ఉందని తెలిపారు. మహిళలు ఏదైన సాధించగలరాని తెలిపారు.



## లయోలా గోల్డెన్ జూబ్లీ వేడుకలను విజయవంతం చేయాలి

**సూర్యాపేట,విశాలభారతి:**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని భాషానాయక్ తండ సమీపంలో ఉన్న లయోలా పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలను విజయవంతం చేయాలని పాఠశాల కరస్పాండెంట్ ఫాథర్ లూయి దాస్, ప్రిన్సిపల్ ఫాదర్ సునీల్ లు కోరారు. శుక్రవారం కమిటీ సభ్యులతో కలిసి పాఠశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1975 2025 పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఈ వేడుకలకు హాజరుకానున్నట్లు చెప్పారు. వ్యాపారాలు ఉద్యోగాల్లో విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సైతం జూబ్లీ వేడుకల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. దాదాపు 3,000 మంది పూర్వ విద్యార్థులు హాజరవుతున్నారని, ఆ మేరకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. సమావేశంలో కోర్ కమిటీ ప్రెసిడెంట్ ఆకారపు రమేష్, వైస్ ప్రెసిడెంట్ పుట్ట కిషోర్, అడ్వైజరి కమిటీ సభ్యులు చలసాని శ్రీనివాస్ రావు, గుర్రం సత్యనారాయణ రెడ్డి, దేవరశెట్టి జనార్ధన్,రాచర్ల కమలాకర్, వజ్రయ్య, పూర్వ విద్యార్థులు సైధి రెడ్డి, మద్ది శ్రీనివాస్ యాదవ్, బూర శేఖర్, శ్రీధర్, ఆనంద్, వెంకటరెడ్డి, సైదులు తదితరున్నారు.



## ముగిసిన జాతీయ స్థాయి సాంకేతిక , క్రీడా పోటీలు

- పోటీలు నిర్వహించిన ఏవిఎన్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం
- వివిధ రాష్ట్రాల సాంకేతిక కళాశాలల నుండి పాల్గొన్న విద్యార్థులు

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

ఇబ్రహీంపట్నం పరిధిలోని ఏవిఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో రుద్రసంధాన్ 2025 సందర్భంగా జాతీయ స్థాయి సాంకేతిక మరియు క్రీడా పోటీలను కళాశాల చైర్మన్ , శాసన మండలి సభ్యులు ఏవిఎన్ రెడ్డి గురువారం ప్రారంభించారు. రెండు రోజుల పాఠశాల ఈ పోటీలు శుక్రవారంతో ముగిసాయి. ఈ పోటీలలో వివిధ రాష్ట్రాల సాంకేతిక కళాశాలల నుండి పాల్గొన్న విద్యార్థులు వారి యొక్క ఆవిష్కరణలు మరియు క్రీడానైపుణ్యాలని ప్రదర్శించారు. ముగింపు వేడుకలలో కళాశాల సెక్రటరీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలలో పాల్గొనటానికి వివిధ రాష్ట్రాల విద్యార్థులు తమ ప్రతిభ ప్రదర్శించటం ఎంతో సంతోషించాల్సిన విషయం అన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థుల కోసం ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా.నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ఇలాంటి కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించటం చాలా సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.అబ్దుల్ నబి, ఏ.ఓ డా. సుధీర్ రెడ్డి , కార్యక్రమ కన్వీనర్ డా. సురేష్ ,కో కన్వీనర్లు డా. జయరాం ,డా. రమేష్ బాబు విద్యార్థులు తదితరులు హాజరయ్యారు.



పెల్వి ఈస్ ప్రాడక్ట్ ను ప్రారంభిస్తున్న జేఎన్టీయూ వీసీ కిషన్ కుమార్ రెడ్డి

## యూరిన్ లీక్ సమస్యకు పరిష్కారం ఫెల్వి ఈస్

- పెల్వి ఈస్ ప్రాడక్ట్ ప్రారంభం
- జేఎన్టీయూ విద్యార్థుల ప్రతిష్టాత్మక పరిశోధన
- జేఎన్టీయూ వీసీ కిషన్ కుమార్

**శేరిలింగంపల్లి,విశాలభారతి:**

యూరిన్ లీక్ సమస్యకు పరిష్కారం ఫెల్వి ఈస్ ప్రొడక్ట్ అని జేఎన్టీయూ వీసీ కిషన్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జెఎన్టీయులో పెల్వి ఈస్ అనే ప్రోడక్ట్ ను జెఎన్టీయు వీసీ కిషన్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు యూరిన్ సమయంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదురుకొంటున్నారని, సమస్యను దృష్టిలో పెట్టుకొని జెఎన్టీయు విద్యార్థులు ప్రతిష్టత్మాకంగా పరిశోధన చేసి పెల్వి ఈస్ అనే ప్రోడక్ట్ ను అందుబాటులోకు తీసుకోని రావడం అభినందనీయమని అన్నారు. 4సంవత్సరాలు కష్టపడి తమ విద్యార్థులు ఇంతమంచి ప్రోడక్ట్ ను తయారు చేశారని కొనియాడారు. అనంతరం టెకరో సంస్థ సీఈఓ నిశాంత్ కుమార్ మార్తా మాట్లాడుతూ.. మహిళలు మేనోపాజ్ సమయంలో తెలియకుండానే యూరిన్ లీక్ అయితుందని దానికి పరిష్కారం పెల్వి ఈస్ ప్రొడక్ట్ అని పేర్కొన్నారు. ప్రపంచంలో ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు ఈ సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. ఎంతో కష్టపడి ఈ ప్రోడక్ట్ ను తయారు చేశామని, వచ్చే నెల నుండి మార్కెట్ లో అందరికి అందుబాటులో ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో ప్రముఖ ఫిజియో సునీత పటేల్, జెఎన్టీయు రిజిస్ట్రార్,ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

cinema updates

# చీరకట్టులో అందాల బేబీ..



సోషల్ మీడియాలో తరచుగా తన అందమైన లుక్స్‌తో ఆకట్టుకునే వైష్ణవి చైతన్య ఈసారి చీరకట్టులో కనిపించి అందర్నీ ఆశ్చర్యపరిచింది. మోడ్రన్ అవుట్‌ఫిట్స్‌తో అదరగొట్టే వైష్ణవి, ఈసారి పింక్ అండ్ గోల్డెన్ కలర్ సిల్క్ చీరలో సంప్రదాయ అందాన్ని హైలెట్ చేసింది. తన గ్లామర్‌తో పాటు, స్టైలిష్ హావభావాలతో కుర్రకారును కనులవిందు చేసింది. ఆమె ఈ లుక్‌లో దిగిన ఫోటోలు వైరల్ అవుతుండటం విశేషం. చీరకట్టులో వైష్ణవి అందానికి అందమైన హెయిర్ స్టైల్, నాజూకైన చెవిపోగులు, సింపుల్ జ్యువెల్రీ మరింత హైలైట్ అయ్యాయి. మరీ ముఖ్యంగా ఆమె చూపు, హావభావాలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఫోటోషూట్‌లో ఆమె క్లాస్ అండ్ గ్రేస్‌ను మిక్స్ చేసి అదిరిపోయే పోజులతో ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌కి మరో అర్థం చెప్పింది. ఫోటోలలో ఆమె కళ్లలో కనిపించే కాన్ఫిడెన్స్, లుక్‌లో ఉండే అందం ఆమెను ట్రెడిషనల్ గర్ల్‌గా నిలబెట్టాయి. సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేసిన ఈ ఫోటోలు క్షణాల్లోనే ట్రెండ్ అయ్యాయి. నెటిజన్లు 'ఈ లుక్‌లో మరింత అందంగా కనిపిస్తున్నావు' అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. ఆమె ఈ చీరకట్టును ఎంతో సొగసుగా మెలిపెట్టుకున్న తీరు మరింత అందంగా ఉన్నట్టు కనిపిస్తోంది. ఇక వైష్ణవి కెరీర్ విషయానికి వస్తే, అల..వైకుంఠపురములో సినిమాతో మంచి గుర్తింపు అందుకున్న అమ్మడు ఆ తరువాత పలు వెబ్ సీరీస్ లతో కూడా క్రేజ్ అందుకుంది. ఇక 'బేబీ' సినిమాతో టాలీవుడ్‌లో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం జాక్ అనే సినిమాతో బిజీగా ఉన్న వైష్ణవి మరో న్యూ ప్రాజెక్టుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. ఆమెకు గతంలో కంటే చాలా ఆఫర్స్ వస్తున్నప్పటికీ మంచి కంటెంట్ ఉన్న సినిమాలను మాత్రమే సెలెక్ట్ చేసుకుంటోంది. మరి రాబోయే సినిమాలు అమ్మడికి ఎలాంటి క్రేజ్ ను తీసుకు వస్తాయో చూడాలి.

# ఫోటో వార్



సినిమా ప్రమోషన్లలో ప్రెస్ మీట్స్, ఫోటోషూట్లు సాధారణం. కానీ కొన్నిసార్లు అవి అనూహ్య పరిస్థితులకు దారి తీస్తాయి. తాజాగా కిరణ్ అబ్బవరం, రుక్సర్ ధిల్లాన్ నటించిన దిల్‌రూబా మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ అలాంటి పరిస్థితే నెలకొంది. ఈ ఈవెంట్‌లో హీరోహీరోయిన్లు, ఇతర తారాగణం పాల్గొనగా, మీడియా ఫోటోగ్రాఫర్స్, హీరోయిన్ రుక్సర్ ధిల్లాన్ మధ్య చోటుచేసుకున్న సంఘటన ఇప్పుడు చర్చనీయాంశమైంది. మీడియా ఫోటోగ్రాఫర్లు ఆమెను ప్రత్యేకంగా కూర్చొని పోజ్ ఇవ్వమని కోరగా, ఆమె అసౌకర్యంగా ఫీలవుతూ కొంత అసహనంగా స్పందించిందట. సాధారణంగా సినిమా ప్రమోషన్ కోసం నటీనటులు ఫోటోషూట్లను సహజంగానే తీసుకుంటారు. కానీ ఈ ఈవెంట్‌లో రుక్సర్ ధిల్లాన్ ఫోటోగ్రాఫర్స్‌కు అనుకోని షాక్ ఇచ్చినట్టు కనిపిస్తోంది. ఆమె ఫోటోలు క్లిక్ చేయడంపై అసంతృప్తిగా స్పందించడంతో, అక్కడున్న మీడియా వ్యక్తులు కూడా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.నిజానికి ఇలాంటి సంఘటనలు తరచుగా జరగవు. కానీ ఈసారి మీడియా ఫోటోగ్రాఫర్స్‌తో హీరోయిన్ మూడ్ కుదురుకోవడం లేదని స్పష్టంగా కనిపించింది. ఆమె అభ్యంతరం వ్యక్తం చేయడం మాత్రమే కాకుండా, మహిళలు ఇలాంటి అసౌకర్యానికి లోనైతే ఎలా ఉంటుందనే ప్రశ్నను కూడా ప్రెస్ మీట్‌లో లేవనెత్తడం చర్చనీయాంశమైంది. మీడియా కోసం ప్రత్యేకంగా బయట వేచిచూసే వారికి కనీసం కనబడకుండా, తాను వెనుక గేటు ద్వారా వెళ్లిపోయిందని వార్తలొస్తున్నాయి.

# జానీ మాస్టర్ స్టెప్పులతో స్టార్ బాయ్..



టాలీవుడ్‌లో వెరైటీ కంటెంట్‌తో ఆకట్టుకునే హీరోల్లో సిద్ధు జొన్నలగడ్డ ఒకరు. 'డీజే టిల్లు'తో తనకంటూ ఓ ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్‌ను ఏర్పరచుకున్న ఈ యువ హీరో ఇప్పుడు మరో మాస్ ఎంటర్టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జాక్ - కొంచెం క్రాక్' మూవీ ఇప్పటికే మంచి అంచనాలను క్రియేట్ చేసింది. ఫుల్ లెంగ్త్ ఎంటర్టైన్మెంట్ ప్యాకేజీగా ఉండబోతున్న ఈ సినిమా టీజర్‌కి అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది.ఇప్పుడు, మ్యూజికల్ ప్రమోషన్స్‌ను స్టార్ట్ చేస్తూ ఫస్ట్ సింగిల్ 'పాబ్లో నెరుడా' విడుదల చేశారు. పాట టైటిల్ వినగానే హీరో క్యారెక్టర్ లో ఆసక్తి పెరిగిపోయింది. పొయెట్ పాబ్లో నెరుడా పేరు ఉపయోగించి మాస్ ఎంటర్‌టైనర్‌కు సాంగ్ తీయడం విభిన్నమైన కాన్సెప్ట్. వనమాలి అందించిన లిరిక్స్ ఆకట్టుకునేలా ఉండగా, అచ్చు రాజమణి మ్యూజిక్ క్యాచీ ట్యూన్‌ను అందించింది. ముఖ్యంగా, బెన్నీ దయాల్ ఎనర్జిటిక్ వాయిస్ పాటను మరో లెవెల్‌కి తీసుకెళ్లింది. ఇకపోతే, జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో సిద్ధు స్టెప్స్ చూసిన అభిమానులు ఆయనను మాస్ డాన్సర్ అని పిలుస్తూ కామెంట్స్ పెడుతున్నారు. ఈ పాటలో సిద్ధు లుక్ చాలా స్టైలిష్‌గా డిజైన్ చేశారు. సాధారణంగా ఆయన సినిమాల్లో ట్రెండీ కాస్ట్యూమ్స్ ఉంటాయి. కానీ 'జాక్'లో మాస్ మసాలా ఎలిమెంట్స్ బాగా మిక్స్ చేయడంతో, లుక్ కూడా దానికి తగ్గట్టుగానే మారింది. కలర్‌ఫుల్ బ్యాక్‌డ్రాప్, స్టైలిష్ కాస్ట్యూమ్స్, హుషారైన డ్యాన్స్ మూమెంట్స్ కలిపి ఈ పాటను మరింత హైలైట్ చేసేశాయి. సిద్ధు అభిమానులు కూడా ఈ పాటను 'జాక్' మూవీకి మూడ్ సెటప్ చేసే సాంగ్‌గా అభివర్ణిస్తున్నారు. సిద్ధు సరసన వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె ఈ సినిమాలో ఓ కొత్త యాంగిల్‌లో కనిపించబోతుందట. బేబీ సినిమాతో ఆకట్టుకున్న వైష్ణవి, ఈ సినిమాలో మరింత గ్లామరస్‌గా కనిపించనున్నట్లు సమాచారం. టీజర్‌లో కనిపించిన ఆమె లుక్స్ కూడా ఇదే విషయాన్ని హింట్ ఇస్తున్నాయి. ఇక ఈ చిత్రాన్ని ఏప్రిల్ 10న థియేటర్లలో గ్రాండ్ గా రిలీజ్ చేయనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమాలో ప్రకాష్ రాజ్, నరేష్, బ్రహ్మాజీ తదితర నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా పూర్తిగా ఫన్ రైడ్ కానుందని చిత్రబృందం తెలిపింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.